# ఉద్యమ కెరటం

నిజం.. రక్షతి రక్షితః

తెలుగు దినపత్రిక

UDYAMA KERATAM TELUGU DAILY

www.udyamakeratam.com



www.udyamakeratam.com

ఉద్యమ కెరటం

రిపోర్టర్లు కావలెను

ఉద్యమ కెరటం దిన పత్రిక లో పని చేయుటకు
జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ, మండల రిపోర్టర్లు కావలెను.

మీ ప్రాంతాలకు సంబంధించిన రాజకీయాలు, సామాజిక, ఇతర అంశాల పై
లోతైన విశ్లేషణలు, రాయగల సామర్థ్యం కలిగి ఉండాలి.
ఆసక్తి గలవారు ఈ క్రింది నెంబర్, ఈ-మెయిల్‌కు తమ బయోడేటాను పంపగలరు.

సెల్: 9030717172

E-mail: udyamakeratamtelugudaily@gmail.com



31.1.2025 శుక్రవారం Friday | సంపుటి (Volume): 1 సంచిక (Issue) : 267 | పేజీలు : 11 Pages : 11 | వెల: 5 RNI: TELTEL12329

Published from : Asifabad, Circulated to : Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahbubnagar, Medak, Nizambad, Rangareddy




## గాంధీకి ఘన నివాళి

గాంధీ వర్ధంతి సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్రెడ్డి నివాళులర్పించారు. లంగర్ హౌస్‌లోని బాపూఘాట్ వద్ద వారు అంజలి ఘటించారు. దేశం, స్వాతంత్ర్యం కోసం గాంధీ చేసిన సేవలను వారు గుర్తుచేశారు. కార్యక్రమంలో పలువురు మంత్రులు, సీఎస్ శాంతికుమారి పాల్గొన్నారు.

- హైదరాబాద్, జనవరి 30

## నేటి నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

- ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ముర్ము ప్రసంగం
- సమావేశాలపై ప్రభుత్వం అఖిలపక్ష భేటీ నిర్వహణ
- విపక్షాలకు వక్ఫ్ తదితర బిల్లుల జాబితా అందచేత

02





## ఉపాధిపనుల్లో అపశృతి

బండరాళ్లు పడి తల్లీ కూతుళ్ల మృతి

5గురికి తీవ్ర గాయాలు, ఆసుపత్రికి తరలింపు

అక్కన్నపేట మండలం గోవర్ధనగిరిలో ఘటన..

ఘటనపై మంత్రి పొన్నం ప్రభాకర్ దిగ్భ్రాంతి

02



## హిమాచల్‌తో విద్యుత్ ఒప్పందాలు

### హిమాచల్ సీఎంతో భట్టి విక్రమార్క భేటీ

- రాష్ట్ర విద్యుత్‌రంగంలో కీలక ముందడుగు
- హైడ్రో పవర్ ప్రాజెక్టులపై సర్కారు ఆసక్తి
- బూట్‌విధానంలో హిమాచల్‌సర్కారు ఆహ్వానం

న్యూఢిల్లీ, జనవరి 30: రాష్ట్ర విద్యుత్ సామర్థ్యాన్ని పెంపొందించడంలో తెలంగాణ ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. డిప్యూటీ సీఎం, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క సూచనలతో రాష్ట్ర అధికారుల ప్రయత్నాలు ఫలించాయి. హిమాచల్ ప్రభుత్వం బూట్ విధానంలో 22 హైడ్రో ఎలక్ట్రికల్ ప్రాజెక్టులపై ప్రతిపాదనలు ఆహ్వానించగా.. తెలంగాణ విద్యుత్‌శాఖ అధికారుల బృందం ఆయా ప్రతిపాదనలపై అధ్యయనం చేసి.. 100 మెగావాట్లకు పైబడిన సామర్థ్యం గల ప్రాజెక్టులపై ఆసక్తిని వ్యక్తం చేసింది. హిమాచల్ సీఎం సుఖ్విందర్‌సింగ్ సఖుతో గురువారం దిల్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమావేశమయ్యారు. ఈ భేటీలో ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. 400 మెగావాట్ల సెలీ హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టు ప్రాంతాలను పరిశీలించారు. వాటికి సంబంధించిన ముసాయిదాను పంపించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హిమాచల్ ప్రదేశ్ సీఎంకు విజ్ఞప్తి చేశారు. ఈ ఒప్పందంపై తెలంగాణ ప్రభుత్వం తగిన పరిశీలన చేసి త్వరితగతిన ఎంవోయూపై సంతకం చేసే విధంగా చర్యలు చేపడుతుందని భట్టి విక్రమార్క తెలిపారు.



## బడ్జెట్ వేళ కాంగ్రెస్ స్టేటస్ రిపోర్ట్

### నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి అంశాల ప్రస్తావన

### మాజీ ఆర్థిక మంత్రి పి చిదంబరం విడుదల

న్యూఢిల్లీ,జనవరి 30: 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ ఫిబ్రవరి 1న కేంద్రం బడ్జెట్ ప్రవేశపెట్టనున్న వేళ కాంగ్రెస్ పార్టీ ఓ నివేదికను విడుదల చేసింది. ఆర్థిక వ్యవస్థ విషయంలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును తప్పుబడుతూ 'రియల్ స్టేట్ ఆఫ్ ది ఎకానమీ 2025' పేరిట నివేదికను పార్టీ విడుదల చేసింది. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి అంశాలను ప్రస్తావించింది. మాజీ ఎంపీ రాజీవ్ గౌడ, ఆయన బృందం రూపొందించిన ఈ నివేదికను పార్టీ

మిగతా 2 లో

## ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో ఇద్దరికి బెయిల్



04

## పాఠశాల విద్యలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం

02



## రాష్ట్రంలో భయాంకర రోజులొచ్చాయి!



కాంగ్రెస్‌ది మొత్తం మోసాల, దగా చరిత్ర

03

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

## విద్యాసంస్థల్లో దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్లు

## త్వరలో ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రకటన

- రిజర్వేషన్ల పెంపు తర్వాత లోకల్‌ఎలక్షన్
- పీసీసీ చీఫ్‌మహేశ్‌కుమార్‌గౌడ్


02

## జీహెచ్ఎంసీ కౌన్సిల్ మీటింగ్ రసాభాస

- మేయర్ పోడియంపైకి ప్లకార్డుల విసిరివేత
- మేయర్‌ను అడ్డుకున్న బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు
- తోసేసుకున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్పొరేటర్లు



04



## సచివాలయంలో నకిలీ ఉద్యోగుల హల్‌చల్

- ఉద్యోగుల పేరుతో దర్జాగా చక్కర్లు

04

ఉద్యమ కెరటం
www.udyamakeratam.com
నిజం.. రక్షతి రక్షితః
తెలుగు దినపత్రిక
UDYAMA KERATAM TELUGU DAILY





## శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు బాంబు బెదిరింపు

**హైదరాబాద్,జనవరి30:** హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో బాంబు ఉందంటూ బెదిరింపులు కావడం కలకలం రేపింది. ఓ ఆగంతకుడు సైబరాబాద్ కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి ఎయిర్‌పోర్ట్‌లో బాంబు ఉందంటూ హెచ్చరించాడు. దీంతో అప్రమత్తమైన ఎయిర్‌పోర్ట్ సెక్యూరిటీ ముమ్మర తనిఖీలు నిర్వహించారు. కాగా, ఈ బాంబు బెదిరింపు కాల్ ఫేక్ అని తేలింది. కామారెడ్డికి చెందిన ఓ వ్యక్తి ఈ కాల్ చేసినట్టు గుర్తించారు. అయితే, నిందితుడికి మతిస్థిమితం లేదని అధికారులు తెలిపారు. మొత్తానికి బాంబు బెదిరింపు కాల్ ఫేక్ అని తేలడంతో ఎయిర్పోర్టు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

## రాహుల్ గాంధీపై పరువు నష్టం కేసు

**న్యూఢిల్లీ, జనవరి 30:** లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై పరువు నష్టం కేసు విచారణ గురువారం వాయిదా పడింది. ఆయన తరపు న్యాయవాది అస్వస్థతకు గురికావడంతో ఈ కేసు తదుపరి విచారణను ఫిబ్రవరి 11కి వాయిదా వేస్తున్నట్లు ప్రత్యేక న్యాయమూర్తి శుభమ్‌వర్మ పేర్కొన్నారు. 2018 కర్ణాటక ఎన్నికల సమయంలో రాహుల్ గాంధీ కించపరిచే వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ బిజెపి నేత పరువు నష్టం కేసు దాఖలు చేశారు. రాహుల్ వ్యాఖ్యలు అభ్యంతరకరమని, తనకు వ్యక్తిగతంగా హాని కలిగించాయని పేర్కొన్నారు. రాహుల్ కోర్టుకు హాజరుకాకపోవడంతో, 2023 డిసెంబర్‌లో ఆయనపై అరెస్ట్ వారెంట్ జారీ అయింది. 2024 ఫిబ్రవరిలో రాహుల్ కోర్టులో లొంగిపోయారు. అదే ఏడాది జులై 26న కోర్టు ఆయన స్టేట్ మెంట్‌ను రికార్డు చేసింది. రూ.25,000 చొప్పున ఇద్దరి పూచీకత్తుపై బెయిల్ మంజూరైంది. ఈ కేసు రాజకీయ కుట్రలో భాగమని రాహుల్ గాంధీ వాదిస్తున్న సంగతి తెలిసిందే.

## బడ్జెట్ వేళ కాంగ్రెస్ స్టేటస్ రిపోర్ట్

మొదటి పేజీ తరువాయి

విడుదల చేసింది. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి అంశాలను ప్రస్తావించింది. మాజీ ఎంపీ రాజీవ్ గౌడ, ఆయన బృందం రూపొందించిన ఈ నివేదికను పార్టీ కేంద్ర కార్యాలయంలో కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఆర్థిక మంత్రి పి చిదంబరం విడుదల చేశారు. ఆర్థిక వ్యవస్థ గురించి పలు కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలో యువతకు తగిన ఉద్యోగావకాశాలు లేవని, ద్రవ్యోల్బణం పెరగుతోందని మాజీ ఆర్థికమంత్రి చిదంబరం వ్యాఖ్యానించారు. ఆదాయంలో అసమానతలు పెరుగుతున్నాయంటూ అసహనం వ్యక్తం చేశారు. 'ఆర్థిక వ్యవస్థ మందగమనంలో ఉంది. దాన్ని మనం తిరస్కరించలేం. దీన్ని మార్చేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టవచ్చు. గతేడాదితో పోలిస్తే వృద్ధి మరింత క్షీణించవచ్చు' అని ఆయన అన్నారు. ఖాళీ పోస్టులు మాత్రమే భర్తీ చేస్తున్నారని, కొత్తగా ఉద్యోగ సృష్టి జరగడం లేదని పేర్కొన్నారు. 'ఆహారం, విద్య, ఆరోగ్య సంరక్షణ ద్రవ్యోల్బణం రెండంకెల్లో ఉంది. 2- 3 ఏళ్ల నుంచి ద్రవ్యోల్బణం పెరుగుతూనే ఉంది. ఆదాయం అసమానతలు ఎక్కువగా ఉన్నాయి. ధనికులు, పేదల మధ్య అంతరం పెరుగుతోంది. దీన్ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ఏ చర్యలూ చేపట్టలేదు' అని చిదంబరం విమర్శించారు. దేశ వాస్తవ ఆర్థిక స్థితిని తెలియజేసే ఉద్దేశంతోనే ఈ నివేదికను రూపొంచినట్లు చిదంబరం చెప్పారు.

## స్పీకర్‌కు వక్ఫ్ సవరణ నివేదిక

**న్యూఢిల్లీ,జనవరి30 :** వక్ఫ్ చట్టంలో మార్పుల పరిశీలన కోసం ఏర్పాటు చేసిన పార్లమెంటరీ సంయుక్త కమిటీ వక్ఫ్ సవరణలపై తుది నివేదికను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు గురువారం సమర్పించింది. ప్యానెల్ ఛైర్‌పర్సన్ జగదాంబికా పాల్ పార్లమెంట్ కార్యాలయంలో బిర్లాను కలుసుఉని ఈ నివేదికను అందజేశారు. బుధవారం నాడు ఈ సవరణ బిల్లుపై విపక్షాలు అసమ్మతి తెలిపాయి. 1511 మెజార్టీ ఓటుపై కమిటీ ఈ ముసాయిదా బిల్లును ఆమోదించింది. ఈ బిల్లుకు బీజేపీ సభ్యులు మద్దతు తెలిపారు. గత ఏడాది ఆగస్టులో ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టగా, వక్ఫ్ ఆస్తుల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావడమే ఈ బిల్లు ముఖ్య ఉద్దేశమని కేంద్రం పేర్కొంది. మరోవైపు ముస్లింలకు రాజ్యాంగ పరంగా ఉన్న హక్కులపై దాడికే ఈ బిల్లును తెచ్చారని , వక్ఫ్‌బోర్డుల పనితీరులో జోక్యం చేసుకోవడమే ప్రభుత్వం అసలు ఉద్దేశమని విపక్షసభ్యులు ఆరోపించారు.

## విద్యాసంస్థల్లో దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్లు

హైదరాబాద్, జనవరి 30: రాష్ట్రంలోని ప్రభుత్వ, ఎయిడెడ్ ఉన్నత విద్యాసంస్థల్లో దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అదనంగా, ఆయా వర్గాల విద్యార్థుల ప్రవేశాలకు గరిష్ట వయోపరిమితిలో 5 సంవత్సరాల మినహాయింపు అందజేశారు. దివ్యాంగుల హక్కుల చట్ట నిబంధనల ప్రకారం, ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా ఈ ఉత్తర్వులను విడుదల చేశారు. ఐజీతీజీ ఒణణజీసలిజీ : సైలెంట్ గా సెట్ చేస్తున్న కాజల్ అగర్వాల్.. లైనప్ మామూలుగా లేదు. దివ్యాంగులను మొత్తం ఐదు కేటగిరీలుగా విభజించి, ప్రతి వైకల్యానికి ప్రత్యేక రిజర్వేషన్ అమలు చేయనున్నారు:

## త్వరలో ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రకటన



**హైదరాబాద్, జనవరి 30 :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయమని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. కులగణన నివేదికపై ఫిబ్రవరి 5న కేబినెట్ సబ్ కమిటీ సమావేశం నిర్వహిస్తామన్నారు. గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడారు. రిజర్వేషన్ల పెంపు తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల సంక్షేమ పథకాలు అమలు కావడం లేదనే అంశంపై స్పందించిన ఆయన.. క్షేత్రస్థాయిలో కొంతమంది అధికారుల వైఫల్యం కారణంగానే కొంతమేరకు పథకాలు లబ్ధిదారులకు అందడం లేదన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థుల జాబితాను పార్టీ అధిష్ఠానం వద్దకు పంపించామని తెలిపారు.

## పాఠశాల విద్యలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం

- పూర్తిస్థాయిలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ వినియోగం
- బెంగళూరు ఎక్ స్టెప్ - ఫౌండేషన్‌ను సందర్శించిన అధికార బృందం




**హైదరాబాద్,జనవరి30 :** ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ను పూర్తి స్థాయిలో ఉపయోగించడం ద్వారా రాష్ట్రంలో పాఠశాల విద్యలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టనున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకంలో పాఠశాల విద్యను మరింత నాణ్యతా ప్రమాణాలతో అందించడానికి గాను ఆర్టిఫిషల్ ఇంటిలిజెన్స్, డిజిటల్ ఇనీషియేటివ్స్ లను పాఠశాల విద్యశాఖ పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలని నిర్ణయించింది. విద్యార్థులలో మరింత మెరుగైన అభ్యాస పద్దతులను, సాంకేతిక ప్రమాణాలను పెంపొందించడం లాంటి వినూత్న కార్యక్రమాలను ప్రవేశ పెట్టనున్నారు. దీనిలో భాగంగా, బెంగుళూరు కేంద్రంగా పనిచేస్తున్న ఎక్ స్టెప్ -ఫౌండేషన్ ను రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి డా. యోగితా రాణా నేతృత్వంలో ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం గురువారం సందర్శించింది. ఈ ప్రతినిధి బృందంలో రాష్ట్ర ఇంటర్మీడియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ కృష్ణ ఆదిత్య, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహా రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్లు ఉమా హారతి, గరిమ తదితరులున్నారు. విద్యా రంగంలో డిజిటల్ పద్దతులను ప్రవేశపెట్టడం ద్వారా విద్యార్థులలో విద్యా పరమైన నాణ్యతా ప్రమాణాలను పెంపొందించడంలో ఎక్ స్టెప్- ఫౌండేషన్ అగ్రగామిగా ఉంది. ఎక్ స్టెప్- ఫౌండేషన్ విజనరీ టెక్నోక్రాట్, ఫిలాంత్రపిస్ట్, ఇన్ఫోసిస్ కో-ఫౌండర్ అయినా నందన్ నీలేకని ఈ ఎక్ స్టెప్-ఫౌండేషన్ కు కో-ఫౌండర్ గానూ ఉన్నారు. విద్యా, వైద్యం, వ్యవసాయ రంగాల్లో డిజిటల్ పద్దతులను ప్రవేశపెట్టి మరింత మెరుగైన సేవలను అందించడానికి ఈ ఎక్ స్టెప్- ఫౌండేషన్ ప్రారంభించారు. ఈ ఫౌండేషన్ ఇప్పటికే గుజరాత్, కర్ణాటక, ఒడిస్సా, పంజాబ్, తమిళనాడు రాష్ట్రాలలో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలతో కలసి పనిచేస్తోంది. గురువారం నాడు, బెంగుళూర్ లో ఎక్ స్టెప్- ఫౌండేషన్ ప్రతినిధులతో కలసి తెలంగాణా విద్యా శాఖ ప్రతినిధి బృందం విద్యారంగంలో చేపట్టాల్సిన పలు ఇన్నియేటివ్ లపై చర్చించింది. ఫౌండషనల్ లిటరసీ, న్యూమెరసీ ప్రాథమిక విద్యా స్థాయిలో ఆర్టిఫిషల్ ఇంటిలిజెన్స్ ఆధారిత డిజిటల్ పద్ధతుల ద్వారా ప్రాథమిక స్థాయిలో రాయడం, చదవడం, సంఖ్యా పరమైన విజ్ఞానాన్ని పెంపొందించుకోవడం. ఉపాధ్యాయులలో వృత్తిపరమైన ప్రమాణాలను పెంపొందించడం , పాఠశాల గదుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా ఉపయోగించడానికి ఉపాధ్యాయులకు డిజిటల్ పద్దతులపై పూర్తి స్థాయిలో శిక్షణ అందించడం వంటి విషాయల్లో వీటిని ఉపయోగిస్తారు. ఎక్ స్టెప్ -ఫౌండేషన్ ను సందర్శించిన, రాష్ట్ర విద్యా శాఖ ప్రతినిధి బృందం 2024 లో కేరళను సందర్శించి అక్కడి విద్యా రంగంలో చేపట్టిన ఆధునిక పద్దతులను పరిశీలించింది. కేరళ ప్రభుత్వం కూడా తన రాష్ట్ర విద్యాశాఖలో ఏ.ఐ టూల్స్ లను పూర్తిస్థాయిలో వినియోగించుకొని మెరుగైన విద్యా ప్రమాణాలను సాధించిందని ఈ బృందం పరిశీలనలో గుర్తించింది. ఈ బెస్ట్ ప్రాక్టీసులను కూడా తెలంగాణా విద్యా శాఖలో ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. ఎక్ స్టెప్ -ఫౌండేషన్ భాగస్వామ్యంతో ఈ ఏ.ఐ ఆధారిత విద్యను ప్రవేశ పెట్టడానికి తెలంగాణ సమగ్ర ప్రణాలికను రూపొందిస్తోంది. డిజిటల్ ఇనిషియేటివ్స్, ప్రాథమిక స్థాయిలో అభ్యసన నైపుణ్యాల పెంపు, విద్యార్థులు, ఉపాధ్యాయులకు స్నేహపూర్వక అభ్యసన పద్ధతుల్లో సహాయం అందించడం రంగాల్లో ఈ ప్రణాళిక ను రూపొందిస్తున్నారు.

## ఉపాధిపనుల్లో అపశృతి

### బండరాళ్లు పడి తల్లీ కూతుళ్ల మృతి
### ఘటనపై మంత్రి పొన్నం ప్రభాకర్ దిగ్భ్రాంతి



**సిద్దిపేట,జనవరి30(ఆర్ఎన్ఎ):** ఉపాధి హామీ పనులు చేస్తుండగా బండరాళ్లు పడి ఇద్దరు కూలీలు మృతి చెందిన ఘటన అక్కన్నపేట మండలంలో గురువారం చోటుచేసుకుంది. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి గ్రామంలోని గుట్ట వద్ద ఉపాధి హామీ పనులు చేస్తున్న క్రమంలో బండరాళ్లు కూలి కందారపు సరోజన (50), తన కూతురు అన్నాజి మమత (35)లపై పడడంతో కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందారు. ఐదుగురికి పలు గాయాలయ్యాయి. రోజువారీ గానే ఉపాధి హామీ పనులకు వెళ్లి పనులు చేస్తున్న క్రమంలో ఒక్కసారిగా కింద ఉన్న మట్టి కదిలి బండరాళ్లు మీద పడడంతో ఇద్దరు కూలీలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వారితో పాటు పని చేస్తున్న ఐదుగురు కూలీలకు గాయాలు కావడంతో గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఏసీపీ వాసాల సతీష్, సీఐ కొండ్ర శ్రీనివాస్, అక్కన్నపేట ఎస్సై విజయభాస్కర్ ఘటన స్థలానికి చేరుకొని మృతి చెందిన ఇద్దరిని పోస్టుమార్టం నిమిత్తం హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఉపాధి హామీ పనులు జరుగుతున్న క్రమంలో పని ప్రదేశాన్ని ప్రమాద పరిస్థితుల్లో ఉందో లేదో అని గమనించకుండా ఫీల్ అసిస్టెంట్ వెంకటస్వామి పని చేయించడాన్ని స్థానికులు ఆయన పనితీరును తప్పు పట్టారు. ఉన్నతాధికారులు కూడా జరుగుతున్న పనిని పర్యవేక్షించకపోవడం వల్లనే ఈ ఘోర ప్రమాదానికి దారితీసిందని నాయకులు, గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇద్దరు ఉపాధి హామీ కూలీలు మరణించడం పట్ల రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ఘటనకు సంబంధించిన కారణాలపై జిల్లా కలెక్టర్ మను చౌదరితో మాట్లాడినట్టు వెల్లడించారు. ఉపాధి హామీలో ఇద్దరి మరణానికి కారణమైన ఘటనపై జిల్లా అధికారులతో విచారణకు ఆదేశించి తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరికి నాణ్యమైన వైద్యం అందించాలని సూచించారు. మరణించిన, గాయపడిన ఉపాధి హామీ కూలీల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి భరోసా కల్పించారు. అనంతరం కేంద్ర మంత్రి బండి సంజయ్ ఘటనపై కలెక్టర్ మను చౌదరితో చరవాణిలో మాట్లాడి గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని, మృతి చెందిన ఇద్దరికీ ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.

## హైకోర్టుకు చేరిన కరీంనగర్ టీయూడబ్ల్యూజే ఎన్నికల వ్యవహారం

**హైదరాబాద్:** గతేడాది డిసెంబర్‌లో జరిగిన కరీంనగర్ తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీయూడబ్ల్యూజే) ఎన్నికల వ్యవహారం హైకోర్టుకు చేరింది. టీయూడబ్ల్యూజే కరీంనగర్ విభాగంలో సభ్యత్వ నమోదులో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ యూనియన్ సభ్యుడైన చెలుకల రామకృష్ణ రెడ్డి ఎన్నికలకు ముందు కలెక్టర్, కార్మిక శాఖ అధికారులకు ఫిర్యాదులు చేశారు. అనంతరం అదే ఎన్నికల్లో పోటీ చేసిన రామకృష్ణ రెడ్డి ఎన్నికల ప్రక్రియపై పలు అభ్యంతరాలు లేవనెత్తారు. సభ్యత్వ జాబితా అందుబాటులో ఉంచకపోవడం, సభ్యత్వం జరిగిన తీరుపై అనేక సందేహాలను వ్యక్తపరిచారు. అయినా, ఎన్నికలు నిర్వహించిన అడ్‌హక్ కమిటీ, ఎన్నికల అధికారులు పట్టించుకోకుండా గతేడాది డిసెంబర్ 11న ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా, అదనంగా పలు సభ్యత్వాలు చేర్చడం, వారికి అప్పటికపుడు ఓటు వేసే అధికారంతోపాటు ఎన్నికల్లో నిలుచునే అవకాశం కూడా కల్పించారన్న ఆరోపణలు రావడం పెద్ద దుమారానికే దారితీసింది. అనంతరం చెలుకల రామకృష్ణరెడ్డి ఎన్నికలు పారదర్శకంగా జరగలేదని, పూర్తిగా ఒకవర్గానికి కొమ్ముకాసేలా అనుకూలంగా వ్యవహరించారని ఆరోపిస్తూ డిసెంబర్ 16న కార్మికశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. అందులో యూనియన్ బైలాస్‌కు వ్యతిరేకంగా మేనేజింగ్ ఎడిటర్లు, యాజమాన్య ప్రతినిధులకు, స్థానికేతరులకు, విలేకరులు కానివారికి సభ్యత్వం కల్పించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో యూనియన్‌లో ఆఫీస్ బేరర్లుగా పనిచేసిన వారితోపాటు పలువురు సీనియర్ సభ్యులను ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా తొలగించారని కూడా ఫిర్యాదులో ప్రస్తావించారు. తాను, కలెక్టర్, కార్మికశాఖ అధికారులకు ఇచ్చిన ఫిర్యాదులను పట్టించుకోకపోవడంతో యూనియన్ సభ్యుడు రామక్రిష్ణ హైకోర్టును ఆశ్రయించాడు. ఎన్నికల్లో సభ్యత్వం విషయంలో జరిగిన అవకతవకలపై చర్యలు తీసుకోవాలని, తాజాగా జరిగిన కరీంనగర్ టీయూడబ్లూజే శాఖ ఎన్నికల్లో నూతనంగా గెలిచిన అధ్యక్షుడు యూనియన్ నిబంధనల ప్రకారం ప్రాథమిక సభ్యత్వానికే అనర్హుడని, సంబంధిత సాక్ష్యాలతో సహా హైకోర్టులో కేసు దాఖలు చేశారు. దీనిని విచారించిన హైకోర్టు రెండు వారాల్లో సంబంధిత అధికారులు యూనియన్ సభ్యుడు రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదును పరిగణనలోకి తీసుకోవాలని కరీంనగర్ కలెక్టర్, కరీంనగర్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ డిపార్ట్‌మెంట్‌ను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

## నేటి నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

**న్యూఢిల్లీ,జనవరి 30 :** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. తొలిరోజు ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగిస్తారు. తరవాత సభలు వాయిదా పడతాయి. ఫిబ్రవరి 1న నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశ పెడతారు. ఈ నేపథ్యంలోనే గురువారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో జరిగిన ఈ భేటీలో కేంద్రమంత్రులు, పలు పార్టీల ఎంపీలు హాజరయ్యారు. ఈసందర్భంగా పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే బిల్లుల జాబితాను కేంద్రం అఖిలపక్షానికి అందించింది. ఇందులో వక్ఫ్ సవరణ బిల్లు కూడా ఉంది. బడ్జెట్ సమావేశాల్లోనే వక్ఫ్ సవరణ బిల్లును పార్లమెంట్‌కు తీసుకురానున్నట్లు కేంద్రం తెలిపింది. దీంతోపాటు మొత్తం 16 బిల్లులను సభల్లో ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించింది.ఆ జాబితాను అఖిలపక్షం ముందు ఉంచింది. వక్ఫ్ చట్టంలో మార్పుల పరిశీలన కోసం ఏర్పాటుచేసిన పార్లమెంటరీ సంయుక్త కమిటీ ఇటీవల సవరణ బిల్లును ఆమోదించిన సంగతి తెలిసిందే. విపక్ష ఎంపీలు సహా ఇతరులు మొత్తంగా 44 మార్పులు సూచించగా.. 14 సవరణలను కమిటీ ఆమోదించింది. దానికి సంబంధించిన తుది నివేదికను సిద్ధం చేసి.. తాజాగా లోక్‌సభ స్పీకర్‌కు అందించింది. వక్ఫ్ ఆస్తుల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని



తీసుకురావడమే ఈ బిల్లు ముఖ్య ఉద్దేశమని కేంద్రం చెబుతోంది. అయితే, ఈ సవరణలపై విపక్షాలు అసమ్మతి తెలిపాయి. ముస్లింలకు రాజ్యాంగపరంగా ఉన్న హక్కులపై దాడికే ఈ బిల్లును తెచ్చారని, వక్ఫ్‌బోర్డుల పనితీరులో జోక్యం చేసుకోవడమే ప్రభుత్వం అసలు ఉద్దేశమని విపక్ష సభ్యులు ఆరోపించాయి. కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి బీజేపీ నుంచి జేపీ నడ్డా, కిరణ్ రిజిజు, అర్జున్ రామ్ మేఘ్వాల్ తదితరులు హాజరయ్యారు. కాంగ్రెస్ నుంచి ఎంపీ జైరామ్ రమేశ్, గౌరవ్ గగోయ్ సహా ప్రతిపక్ష ఇండియా కూటమిలోని పార్టీలకు చెందిన పలువురు ఎంపీలు హాజరయ్యారు. సభ సజావుగా సాగడంతో పాటు ముఖ్యమైన అంశాలపై భేటీలో చర్చించారు. పార్లమెంట్ సమావేశాలు రెండు విడుతల్లో జరుగనున్న విషయం తెలిసిందే. తొలి విడత సమావేశాలు 31 నుంచి మొదలై.. ఫిబ్రవరి 13 వరకు కొనసాగుతాయి. ఇక రెండో విడుత సమావేశాలు మార్చి 10న మొదలై.. ఏప్రిల్ 4 వరకు కొనసాగుతాయి. తొలిరోజు శుక్రవారం పార్లమెంట్ ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగిస్తారు. రాష్ట్రపతి ప్రసంగం అయిన అరగంట తర్వాత.. రాజ్యసభ కార్యకలాపాలు మొదలవుతాయి.

ఉద్యమ కెరటం
తెలుగు దినపత్రిక
www.udyamakeratam.com
UDYAMA KERATAM TELUGU DAILY
శుక్రవారం
31 జనవరి 2025


# గద్దర్‌ను విమర్శిస్తే సహించేది లేదు

**• ఉద్యమకారుల జేఏసీ**



**హైదరాబాద్, జనవరి 30:** గద్దర్ ఒక వ్యక్తి కాదు సమూహశక్తి అని, ఆయనను విమర్శిస్తే సహించేది లేదని తెలం గాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్‌యాదగిరి, ప్రధాన కార్యదర్శి తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డిలు అన్నారు. చిక్కడపల్లి తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో గద్దర్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుల్తాన్ యాదగిరి, ప్రఫుల్ రాంరెడ్డి మాట్లాడుతూ సంగ్రామభేరి, వేలాది ప్రజలను మేల్కొల్పిన అంబేద్కర్ వాది, అడవి బిడ్డలు, కార్మిక, కర్షక వర్గాలు, బడుగు, బలహీనవర్గాల కోసం పోరాడిన గద్దర్ లాంటి మహనీయులకు పద్మ అవార్డు చాలా చిన్నదన్నారు. నేడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మనువాద సిద్ధాంతాలతో మూఢనమ్మకాలతో దేశాన్ని పాలించాలనిచూస్తున్నారని మండిపడ్డారు. దళితులను, ఆదివాసీలను అణిచివేయాలని చూస్తున్నారని అందులో భాగంగానే గద్దర్‌కు పద్మ అవార్డు తిరస్కరించారని మండిపడ్డారు. రాజ్యాంగపరిధిలో పనిచేస్తున్న తెలంగాణ రాష్ట్రప్రభుత్వం పద్మ అవార్డులు వీరికివ్వాలని తీర్మానం చేసి కొన్ని పేర్లు కేంద్రానికి పంపిస్తే దళితులను, గద్దర్, గోరటివెంకన్న, అందెశ్రీ, గిరిజనులకై జీవితం ధారబోసిన జయధీర్ తిరుమలరావులకు అవార్డులు తిరస్కరించారన్నారు. బండి సంజయ్ కేంద్రమంత్రి అయ్యాడు. ఆయన ఏ పోరాటాలూ చేయలేదని ఎవరి బతుకులు కూడా మార్చలేదని ఆయనకు ఉన్న అర్హత ఒక్క నోటి దూల మాత్రమేనని కేంద్రప్రభుత్వం వెంటనే బండి సంజయ్‌ను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు గంటి చంద్రుడు, జగన్, చంద్రన్నప్రసాద్, సురేషబాబు, రాజయ్య, యాదగిరి, రాజు తదితరులు పాల్గొన్నారు. గద్దర్ లలితకళల సమగ్ర స్వరూపం అని వెంకటేశ్వరయూనివర్శిటీ పూర్వ వీసీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో ఎందరో మహానుభావుల మధురస్మృతుల పరంపరలో భాగంగా ప్రజా గాయకుడు గద్దర్ జయంతి సభ జరిగింది. ఈ సందర్భంగా ఆచార్య ఇనాక్ మాట్లాడుతూ గద్దర్ పాట రాసి నాట్యం చేస్తూ పాడే తీరు శిల్పంలా ఉంటుందన్నారు. మానవీయ సంబంధాలకు ప్రాధాన్యం ఇచ్చిన ప్రేమతత్వం ఆయనలో ఉందన్నారు. తాను అనంతపురంలో కళాశాలలో ఉపన్యాసకుడిగా ఉన్న సమయంలో గద్దర్ రచనలను పాఠ్యాంశాలుగా బోధించానని గుర్తుచేశారు. అధ్యక్షత వహించిన జనార్దనమూర్తి మాట్లాడుతూ గద్దర్ గానసభకు పలుమార్లు వచ్చారని ఆయన పాటలో ఉత్తేజం పాటలో ఆప్యాయత వ్యక్తం అవుతాయన్నారు. కాంగ్రెస్ నేత ఉప్పల శ్రీనివాసగుప్తా మాట్లాడుతూ హృదయాన్ని తాకేలా గద్దర్ పాటరాస్తారని పాడుతారన్నారు. సంఘసేవకులు భవానిశ్రీనివాస్, సుధాకర్, ప్రభాకర్, వెంకటేష్, రామ్‌రెడ్డి మాట్లాడుతూ గద్దర్‌కు పద్మ అవార్డ్ ఇవ్వబోమని ప్రకటిండాన్ని ఖండిస్తూ మాట్లాడారు.

# అభివృద్ధికి నిధులు అడిగితే అరెస్టు చేస్తారా : హరీశ్‌రావు



**హైదరాబాద్,జనవరి30 :** జీహెచ్‌ఎంసీ బీఆర్ఎస్ కార్పొరేటర్ల అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నాం అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. హైదరాబాద్ నగర అభివృద్ధి కోసం నిధులు ఇవ్వాలని అడిగితే అరెస్టులు చేస్తారా? అని కాంగ్రెస్ సర్కార్‌పై మండిపడ్డారు. రాష్ట్రానికి గుండె కాయ లాంటి హైదరాబాద్ నగరాన్ని నిర్లక్ష్యం చేస్తున్న మీ వైఖరిని నిలదీస్తే మార్షల్స్‌తో కార్పొరేటర్లను బడ్జెట్ కౌన్సిల్ నుంచి బయటికి పంపిస్తారా? అని రేవంత్ సర్కార్‌పై హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బడ్జెట్ మీద ఎలాంటి చర్చ లేకుండానే అమోదిస్తున్నట్లు ప్రకటించడం అప్రజాస్వామికం. మీ నిరంకుశ వైఖరికి ఇది మరో నిదర్శనం. ప్రజల తరుపున ప్రశ్నించే ప్రజాప్రతినిధుల గొంతు నొక్కాలని చూస్తే సహించేది లేదు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# బీఆర్ఎస్ కార్పొరేటర్ల అరెస్టు అక్రమం : కేటీఆర్




**హైదరాబాద్,జనవరి 30 :** జీహెచ్‌ఎంసీ పాలకమండలి సమావేశంలో హైదరాబాద్ నగరాన్ని పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టినందుకు బీఆర్ఎస్ కార్పొరేటర్‌లను అరెస్టు చేయడం దుర్మార్గం అని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత హైదరాబాద్ నగరానికి నిధులు ఇవ్వడం లేదని కోటి మంది నగర ప్రజల తరఫున ప్రశ్నిస్తే బయటకి గెంటేస్తారా? అని నిలదీశారు. గత సంవత్సరం పెట్టిన బడ్జెట్ నిధులను కనీసం కూడా ఖర్చు చేయకుండా.. మరోసారి అవే కాగితాలపైన అంకెలు మార్చి గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ మోసాన్ని అడ్డుకున్నందుకు మా ప్రజాప్రతినిధుల గొంతు నొక్కుతారా? అని రేవంత్ సర్కార్‌ను కేటీఆర్ ప్రశ్నించారు. పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ సరఫరా వంటి కనీస ప్రజావసరాలను కూడా సరిగ్గా నిర్వహించలేని జీహెచ్‌ఎంసీ అసమర్ధ తీరును ప్రశ్నిస్తే కూడా ఈ ప్రభుత్వం జీర్ణించుకోవడం లేదు. హైదరాబాద్ నగర ప్రజల సమగ్ర అభివృద్ధి కోసం గత ప్రభుత్వం ప్రారంభించిన అన్ని అభివృద్ధి కార్యక్రమాలను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నానని కేటీఆర్ పేర్కొన్నారు.

# విమాన ప్రమాదంలో 28 మృతదేహాలు వెలికితీత

**ప్రాణాలతో మిగిలే ఛాన్స్ లేదన్న అధికారులు**

**వాషింగ్టన్, జనవరి 30 :** వాషింగ్టన్ సమీపంలో ప్రయాణికుల విమానం, సైనిక హెలికాప్టర్ ఢీకొన్న ఘటనలో విమానంలో ఉన్న మొత్తం 64 మంది ప్రాణాలు కోల్పోయి ఉండొచ్చని అక్కడి అగ్నిమాపక శాఖ చీఫ్ వెల్లడించారు. ఇప్పటి వరకు 28 మృతదేహాలను నదిలోంచి బయటకి తీసినట్లు తెలిపారు. గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. అయితే, విమానంలో ఉన్న వారెవరూ ప్రాణాలతో బయటపడే అవకాశం లేదని ఆయన స్పష్టం చేశారు. గత 24 ఏళ్లలో అమెరికాలో ఇదే అతిపెద్ద ప్రమాదమన్నారు. విమానం తలకిందులుగా నది అడుగుభాగంలో కూరుకుపోయిందని, అక్కడికి దగ్గర్లోనే హెలికాప్టర్ శకలాలను కూడా గుర్తించామని సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్న జాన్ డొన్నెలీ తెలిపారు. కాన్సాస్‌లోని విషిటా నుంచి బయల్దేరిన పీఎస్ఏ ఎయిర్‌లైన్స్ ప్రయాణికుల విమానం వాషింగ్టన్ సమీపంలోని రోనాల్డ్ రీగన్ నేషనల్ ఎయిర్‌పోర్టు రన్‌వేపై దిగేందుకు సిద్ధమవుతుండగా.. రక్షణ శాఖకు చెందిన సికోర్‌స్కీ హెచ్‌-60 బ్లాక్‌హాక్ హెలికాప్టర్‌ను ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. అమెరికా కాలమానం ప్రకారం బుధవారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. అమెరికన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఈ విమానాన్ని.. స్థానికంగా పీఎస్ఏ ఎయిర్‌లైన్స్ నిర్వహిస్తోంది. ఘటన సమయంలో విమానంలో 60 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బంది ఉన్నారు. ఇక, హెలికాప్టర్‌లో ముగ్గురు సైనికులు ఉన్నారని, వీఐపీలు ఎవరూ లేరని రక్షణ శాఖ అధికారులు తెలిపారు. వీరి గురించి గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.



# 27 ఎకరాల్లో రూ. 2వేల కోట్లతో ఉస్మానియా ఆసుపత్రి

## 30 డిపార్టుమెంట్‌లు, 2వేల పడకలు

**1న ఉస్మానియా దవాఖాన నూతన భవన నిర్మాణానికి భూమిపూజ**

**హైదరాబాద్,జనవరి 30:** హైదరాబాద్ గోషామహల్ పోలీస్ గ్రౌండ్‌లో 27 ఎకరాల్లో దాదాపు 2వేల కోట్ల అంచనా వ్యయం తో ఈ కొత్త ఆస్పత్రి నిర్మాణం జరగనుంది. 30 డిపార్ట్‌మెంట్‌లు, 2వేల పడకలు, ఫిజియోథెరపీ, డెంటల్, కాలేజ్‌లు, హాస్టల్ వసతితో ఆసుపత్రి నిర్మాణం జరగనుంది. అడ్డంకులు దాటుకొని శంకుస్థాపనకు సిద్ధం అయింది ఉస్మానియా జనరల్ ఆసుపత్రి. రానున్న టెక్నాలజీ కాలానికి అనుగుణంగా హెలిప్యాడ్ వసతి,ఆసుపత్రి మురుగు నీరు శుద్ధి చేసేందుకు ప్లాంట్, విశాలమైన పార్కింగ్ ఫెసిలిటీ తో కొత్త ఆస్పత్రి అందుబాటులోకి రానుంది. శనివారం ఉదయం సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ప్రతి డిపార్ట్‌మెంట్ కోసం స్టేట్ ఆఫ్ ఆర్ట్ ఫెసిలిటీస్‌తో కూడిన ఆపరేషన్ థియేటర్లు, పోస్ట్ ఆపరేటివ్ వార్డులు, ఐసీయూ వార్డులు అందుబాటులో ఉంటాయన్నారు. కిడ్నీ, లివర్, స్కిన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ల కోసం అత్యాధునిక టెక్నాలజీతో కూడిన ట్రాన్స్‌ప్లాంటేషన్ విభాగం కొత్త ఉస్మానియాలో అందుబాటులోకి రానున్నాయి. పేషెంట్ల సౌకర్యార్థం అన్ని రకాల డయాగ్నసిస్ సేవలను ఒకే చోట అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్‌లో ఓపీ సేవలు అందించాలని పేషెంట్ల కోసం విశాలమైన వెయిటింగ్ హాల్స్, కనీసం రోజూ 3 వేల నుంచి 5 వేల మంది పేషెంట్లు వచ్చే అవకాశం ఉన్నందున, ఇందుకు అనుగుణంగా ఓపీ కౌంటర్ల నిర్మాణం జరగనుంది.ఓపీ కోసం గంటల తరబడి లైన్‌లో నిలబడే ప్రసక్తే ఉండకుండా నిర్మాణం. కొత్త ఉస్మానియాలో నర్సింగ్, డెంటల్, ఫిజియో థెరపీ కాలేజీలు అందుబాటులోకి..స్టూడెంట్ల కోసం హాస్పిటల్ ఆవరణలోనే హాస్టల్స్‌ను నిర్మనం. 750 సీట్లతో కూడిన భారీ ఆడిటోరియం అందుబాటులోకి రానుంది.

# పెళ్లి పేరుతో యువతిపై నాలుగేళ్లుగా అత్యాచారం

## కాంగ్రెస్ ఎంపి రాకేశ్ రాథోడ్ అరెస్ట్

**లక్నో,జనవరి 30:** కాంగ్రెస్ ఎంపీ రాకేశ్ రాథోడ్‌ను యూపీ పోలీసులు అరెస్టు చేశారు. సీతాపుర్ ఎంపీగా ఉన్న ఆయనపై అత్యాచార ఆరోపణలపై కేసు నమోదు కావడంతో అదుపులోకి తీసుకున్నారు. సీతాపుర్‌లోని తన నివాసంలో మీడియాతో మాట్లాడుతుండగానే ఆయన్ను అరెస్టు చేసినట్లు సమాచారం. భారీ పోలీసు భద్రత నడుమ ఆయన్ను కోర్టుకు తీసుకెళ్లారు. తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి నాలుగేళ్లుగా తనపై అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపిస్తూ ఓ మహిళ జనవరి 17న పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనతో మాట్లాడిన కాల్ రికార్డింగ్స్‌ను సైతం పోలీసులకు సమర్పించారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో బుధవారం ఉదయమే ఎంపీ రాథోడ్ అలహాబాద్ హైకోర్టు లఖ్‌నవూ బెంచ్‌లో ముందస్తు బెయిల్ పిటిషన్ వేయగా.. న్యాయస్థానం తిరస్కరించింది. రెండు వారాల్లోగా సెషన్స్ కోర్టులో లొంగిపోవాలని సూచించినట్లు సమాచారం. అంతకముందు ఇదే కేసులో ఎంపీ, ఎమ్మెల్యే కోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ వేసినా తిరస్కరణకు గురైంది. ఈ నేపథ్యంలో గురువారం ఆయన నివాసం వద్దకు భారీ బందోబస్తుతో వెళ్లిన పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం రాకేశ్ అలహాబాద్ హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ వేయగా బెయిల్ ఇచ్చేందుకు కోర్టు నిరాకరించింది. పోలీసుల ముందు లొంగిపోవాలని ఆదేశించింది. అంతకుముందు సీతాపూర్ లోని ఎంపీ ఎమ్మెల్యే కోర్టులో కూడా రాకేశ్ ముందస్తు బెయిల్ కోసం పిటిషన్ వేశారు. అక్కడ కూడా ఆయనకు నిరాశే ఎదురైంది.అలహాబాద్ హైకోర్టు ఆదేశాల మేరకు రాకేశ్ రాథోడ్ గురువారం ఉదయం పోలీసుల ముందు లొంగిపోయారు. దాంతో పోలీసులు ఆయనను అరెస్ట్ చేశారు. రాకేశ్ రాథోడ్ గత లోక్‌సభ ఎన్నికల్లో సీతాపూర్ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున ఎంపీగా గెలిచారు. ఈ క్రమంలో రాకేశ్ రాథోడ్.. పెళ్లి చేసుకుంటానని, రాజకీయ భవిష్యత్తు ఇస్తానని మాయ మాటలు చెప్పి గత నాలుగేళ్లుగా తనపై అత్యాచారానికి పాల్పడుతున్నాడని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అందుకు సంబంధించిన ఆధారాలు సమర్పించారు.

# రాష్ట్రంలో భయాంకర రోజులొచ్చాయి!



**కాంగ్రెస్‌ది మొత్తం మోసాల, దగా చరిత్ర**
**బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**

**నిజామాబాద్ ప్రతినిధి:** కాంగ్రెస్ పాలనతో రాష్ట్రంలో భయంకరమైన రోజులు వచ్చాయని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ దుష్పరిపాలన వల్ల తెలంగాణ వందేళ్లు వెనక్కివెళ్లి పరిస్థితి తలెత్తిందని చెప్పారు. అన్ని రంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, అబద్దాలతో సీఎం రేవంత్ రెడ్డి కాలం వెళ్లదీస్తున్నారని విరుచుకుపడ్డారు. అబద్దం అద్దం ముందు నలబడితే రేవంత్ రెడ్డి బొమ్మ కనబడుతుందని ఎద్దేవా చేశారు. ప్రజలను మభ్యపెట్టి ఎక్కువకాలం పరిపాలించలేరని స్పష్టం చేశారు. అలవిగాని హామీలిచ్చి ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని విమర్శించారు. గురువారం నిజామాబాద్ జిల్లాలో ఎమ్మెల్సీ కవిత పర్యటించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలిసీ తెలియక హామీలిచ్చామని స్వయంగా అసెంబ్లీ స్పీకర్ అన్నారని గుర్తు చేసన ఎమ్మెల్సీ కవిత... 130 ఏళ్ల చరిత్ర ఉన్నదని గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ ప్రజలను ఎలా మోసం చేస్తుందని ప్రశ్నించారు. చేతిలో ఎర్రబుక్కు పట్టికొని దేశమంతా తిరిగే రాహుల్ గాంధీ తెలంగాణ పరిస్థితులపై ఎందుకు మాట్లాడడం లేదని నిలదీశారు. గతంలో తెలంగాణను ఆంధ్రలో కలిసి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు కూడా అదే ఒరవడిని కొనసాగిస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ చరిత్ర మొత్తం మోసాల చరిత్ర, దగా చరిత్ర అని విరుచుకుపడ్డారు. ఇటీవల గ్రామ సభల్లో ప్రజలు ప్రభుత్వంపై తిరుగుబాటు చేశారని చెప్పారు. రైతు భరోసా, రేషన్ కార్డులు ఎవరికి ఇస్తున్నారో అర్థంకాని పరిస్థితి ఏర్పడిందని, సచివాలయంలో ఏసీ గదుల్లో కూర్చొని తయారు చేసిన లబ్దిదారుల జాబితాను గ్రామాల్లోకి తీసుకొచ్చి చదువుతున్నారని వివరించారు. తాము చెప్పినవాళ్ళకే పథకాలు వస్తాయని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రకటనలు చేస్తున్నారని, ఈ వైఖరి సరికాదని సూచించారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన వాటినే అటూ ఇటూ మార్చి కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్నదని, కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నదేమీ లేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో మంజూరు చేసిన పనులను తామే చెశామని చెప్పడమే తప్పా ప్రభుత్వం చేస్తున్నదేమీ లేదని విమర్శించారు. కాగా, యూరియా కోసం రైతులు మళ్లీ లైన్లు కట్టే పరిస్థితి వచ్చిందని, కరెంటు ఎప్పుడొస్తుందా ఎప్పుడు పోతుందా అన్నది తెలియని దుస్తితి ఏర్పడిందని, చెరువులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలిపారు. నిజామాబాద్ జిల్లాకు నీళ్లిచ్చే కాళేశ్వరం ప్యాకేజీ 21 పనులు పూర్తి చేయని చేతగాని ప్రభుత్వం అని ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమలు చేయడం లేదని ఎండగట్టారు. పెన్షన్ మొత్తాన్ని పెంచకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని, కేసీఆర్ హయాంలో ఇచ్చిన పెన్షన్లే ఇంకా ఇస్తున్నారని, న్షన్ మొత్తాన్ని పెంచడంపై ప్రజలు ప్రశ్నిస్తున్నారని వివరించారు. 18 ఏళ్లు నిండిన ఆడపిల్లలను స్కూటీలు ఏమైయ్యాయని అడిగారు. ఎల్లారెడ్డి పాఠశాలలో విషాహారం తిని విద్యార్థులు అస్వస్థతకు గురికావడం బాధాకరమన్నారు. కేసీఆర్ పెట్టిన గురుకులాలను కూడా నడపడం కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతకావడం లేదని విమర్శించారు. తరుచూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని, ప్రభుత్వం తక్షణమే మొద్దు నిద్రవీడి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పసుపు పంట మార్కెట్ కు వస్తున్న నేపథ్యంలో కనీస మద్దతు ధర ప్రకటించడానికి కేంద్రంలోని బీజేపీ సర్కార్ తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ఖలిస్థానీ ఉగ్రవాది పన్నూపై 104 కేసులు

**న్యూఢిల్లీ, జనవరి 30:** ఖలిస్థానీ ఉగ్రవాది, 'సిఖ్స్ ఫర్ జస్టిస్' ఉగ్ర సంస్థ వ్యవస్థాపకుడు గురుపత్వంత్ సింగ్ పన్నూపై భారత్‌లో 104 కేసులు నమోదయ్యాయి. 'పంజాబ్, చండీగఢ్, హిమాచల్ ప్రదేశ్, హరియాణా, రాజస్థాన్, అస్సాం రాష్ట్రాల్లో ఎస్ఎఫ్‌జెపై 96 కేసులు ఉన్నాయి. మిగతా ఎనిమిది కేసుల్ని జాతీయ దర్యాప్తు సంస్థ విచారిస్తోందని కేంద్ర ప్రభుత్వం తన గెటిజ్‌లో పేర్కొంది. ఎస్ఎఫ్‌జెపై ఉన్న ఐదేళ్లపాటు నిషేధాన్ని పొడిగించినట్లు దిల్లీ హైకోర్టుకు చెందిన ట్రైబ్యునల్ ధ్రువీకరించింది. ఈ విషయాన్ని కేంద్రం పేర్కొంది. ప్రభుత్వంలో అగ్రస్థానాల్లో ఉన్న వ్యక్తులను ఉద్దేశించి ఆ గ్రూప్ చేసిన బెదిరింపులు, ఇతర విధ్వంసకర కార్యకలాపాలను ప్రస్తావించింది. ఇదిలాఉంటే.. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ప్రమాణం సందర్భంగా ప్రముఖులతో ఏర్పాటుచేసిన ఓ కార్యక్రమంలో పన్నూ ప్రత్యక్షమవడం ఆందోళనలకు కారణమైంది. ఈ పరిణామంపై స్పందించిన భారత్.. తమ దేశ భద్రతకు సంబంధించిన అంశాలను అమెరికా వద్ద లేవనెత్తుతూనే ఉంటామని స్పష్టం చేసింది. 'భారత వ్యతిరేక కార్యకలాపాలు ఎప్పుడు జరిగినా అమెరికా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. మా దేశ భద్రతపై ప్రభావం చూపే, భారత్ వ్యతిరేక ఎజెండాలపై ఆందోళనలను అక్కడి ప్రభుత్వం వద్ద లేవనెత్తడాన్ని కొనసాగిస్తాం' అని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ పేర్కొన్నారు. ట్రంప్ ప్రమాణం సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆహ్వానం లేకున్నా పన్నూ హాజరయ్యాడని పలు మీడియా కథనాలు వెల్లడించాయి. ట్రంప్ వేదిక పైకి వచ్చిన సమయంలో 'యూఎస్ఏ, యూఎస్ఏ' అని అక్కడున్నవారంతా నినాదాలు చేస్తుంటే.. పన్నూ ఖలిస్థానీకి మద్దతుగా నినాదాలు చేసినట్లు సమాచారం. ఈ ఫిబ్రవరిలో ప్రధాని మోదీ అమెరికాలో పర్య టించనున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఎస్ఎఫ్‌జెపై కేంద్రం తీసుకుంటున్న చర్యల ప్రస్తావన వచ్చింది.



# విషాదంలోనూ రాజకీయాలేనా?

సనాతనధర్మం...కుంభమేళ పర్వంలో స్పష్టంగా గోచరిస్తోంది. ప్రజలు తండోపతండాలుగా తరలి వచ్చి పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. కుంభమేళా కోసం యూపి ప్రభుత్వం గత రెండేళ్లుగా పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. దీంతో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరక్కుండా సిఎం యోగి ఆదిత్యనాథ్ జాగ్రత్తలు తీసుకున్నారు. కోట్లాది మంది వచ్చి పుణ్యస్నానాలు ఆచరించే స్థలం కాబట్టి పలు జాగ్రత్తలు అవసర మయ్యాయి. కానీమౌని అమవాస్యవేళ పుణ్యస్నానమాచరించడం అద్భుతం..అంటూ భక్తకోటి ప్రయాగ్ రాజ్‌కు క్యూకట్టింది. ఇప్పటికే అక్కడ ఇసుకేస్తే రాలనంత జనం. కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్. బుధవారం మౌని అమవాస్య సందర్భంగా 10కోట్లమంది భక్తులు వస్తారని అంచనా వేసి మరీ ఏర్పాట్లు చేశారు. కానీ ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకున్నా..ప్రజలు మాత్రం క్మశిక్షణ అలవర్చుకోలేక పోతున్నారు. ఈ క్రమంలో బుధవారం తెల్లవారు జామున పరిస్థితి తొక్కిసలాటకు దారితీసింది. జరగరాని అపచారం జరిగింది. ప్రశాంతంగా సాగుతున్న కుంభమేళా మహావిషాదం నింపింది. కనీసం 30 మంది మరణించారని, మరో 50 మంది క్షతగాత్రులు అయ్యారని ప్రభుత్వం ప్రకటించింది. ఈ ఘటన విషాదకరం. వారి కుటుంబాల కు తీరని లోటు. అలాంటి సమయంలో కాంగ్రెస్ పార్టీ సహా సమాజ్‌వాదీ పార్టీ రాజకీయాలు చేయడం దారుణం. కుంభమేళాలో విఐపి సంస్కృతి వల్లనే ప్రమాదం జరిగిందని రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలు విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యమంటూ గగ్గోలు పెట్టారు. కుంభమేళాలోమునిగినా మోడీ, అమిత్ షాలు నరకానికి పోతారని ఖర్గే శాపనార్థాలు పెట్టారు. యోగి రాజీనామా చేయాలని యూపి మాజీ సిఎం అఖిలేశ్ యాదవ్ అన్నారు. ఏర్పాట్లు సక్రమంగా లేవని నిందించారు. ఇలా ఎంతగా రాజకీయం చేయాలో అంతా చేశారు. నిజంగానే ఇక్కడ కించిత్ కూడా లోపం లేదు. ఏర్పాట్లలో పొరపాట్లు లేవు. ప్రజల తొందరపాటు కారణంగా, గందరగోళం కారణంగా దుర్ఘటన జరిగింది. ఆ తరవాత అంతా సద్దు మణిగింది. దాదాపు మూడున్నర కోట్ల మంది ఒక్కరోజే పుణ్యస్నానాలు చేసినట్లుగా చెబుతున్నారు. ఇంత పెద్ద మహాజాతరలో జరిగిన ఘటనను కూడా రాజకీయం చేయడం కాంగ్రెస్‌కే చెల్లింది. యూపి సిఎం రాజీనామా చేయాలనడం అజ్ఞానం తప్ప మరోటి కాదు. జాతరలు, కుంభమేళాలు, సముద్ర స్నానాల సమయంలో సంయమనంతో సాగాల్సి ఉన్నా అలా జరగలేదు. కోట్లాది మంది వస్తారని తెలిసీ..ప్రజలు ఉరుకులు పరుగులు తీయడంతో జరగరాని దుర్ఘటన జరిగింది. ప్రయాగరాజ్ మౌని అమవాస్య వేళ జనమహాసంద్రంగా మారింది. నిజానికి మంగళవారం మధ్యాహ్నానాని కే 2.39కోట్లమంది ప్రయాగ్‌రాజ్‌కు చేరుకున్నట్లు సమాచరం వచ్చింది.. మామూలుగా రోజుకు కోటిమంది వస్తేనే త్రివేణి సంగమ ప్రాంతం కిటకిటలాడుతూ ఉంటుంది. అలాంటిది ఒక్కరోజే 2కోట్ల 39లక్షలమంది రావడంతో..ప్రయాగ్‌రాజ్‌కు వచ్చే అన్నిదారులు కిటకిటలాడాయి. ఇంత భారీగా భక్తులు క్యూకట్టడంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయింది. ఇక భక్తులు రైల్వేస్టేషన్, బస్టాండ్,.. ఇలా పలుమార్గాల్లోనుంచి త్రివేణి సంగమం చేరుకోవాలంటే 10నుంచి 12కిలోమీటర్లు నడవాల్సిన పరిస్థితి ఏర్పడిందంటే ఎంతగా జనం వచ్చారో అర్థం చేసుకోవచ్చు. జనవరి 13న ప్రారంభమైన ప్రయాగ్‌రాజ్ మహాకుంభ్..మొదటి రోజునుంచే బారీ భక్తజనం పోటెత్తింది. తొలిరోజే పౌష్ పూర్ణిమ కావడంతో మొత్తం 1 కోటి 65 లక్షల మంది స్నానాలు చేసినట్లు లెక్కలు వచ్చాయి. అలా ఇప్పటివరకు దాదాపు 17కోట్లమంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించినట్లు లెక్కలు చెబుతున్నాయి. డిజిటల్ కెమెరాల ద్వారా కౌంటింగ్ కొంచెం తేలికైంది. యూపీ ప్రభుత్వం ఈ ఏడాది నగరవ్యాప్తంగా 2700 కెమెరాలను ఏర్పాటు చేసింది. వీటిలో 1800 కెమెరాలను జాతర ప్రాంతంలో ఏర్పాటు చేశారు. 1100 పర్మినెంట్ కెమెరాలు కాగా, మిగిలిన700 తాత్కాలిక కెమెరాలు. 270 కంటే ఎక్కువ కెమెరాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ను ఇన్‌స్టాల్ చేశారు. లెక్కింపు పక్రియ ఎలా ఉంటుందంటే..ఓవ్యక్తి కమెరా సర్కిల్‌లోకి రాగానే ఆటోమేటిక్‌గా కౌంట్ చేయబడతాడు. ఏఐ కెమెరాలు ప్రతి నిమిషానికి డేటా అప్‌డేట్ చేస్తూ ఉంటాయి. మొత్తం మూడు విధాలుగా ఈలెక్కింపు పక్రియ ఉంటుంది. ప్రయాగ్‌రాజ్ చేరుకునేందుకు 7ప్రధాన మార్గాలు ఉన్నాయి. అక్కడి నుంచి త్రివేణి సంగమానికి చేరుకునేందుకు మొత్తం 12 మార్గాలను ఏర్పాటు చేశారు. ఈసారి క్రౌడ్ మేనేజ్‌మెంట్ కోసం స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ -సురక్షఖ యాప్‌ను యూపీ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. డ్యూటీ చార్ట్‌లు, రూట్ ప్లానింగ్, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, పాంటూన్ బ్రిడ్జ్ ఏర్పాట్లతో పాటు క్రౌడ్ కంట్రోల్ ప్లాన్‌లు వంటివన్నీ ఉన్నాయి. బుధవారం మౌని అమవాస్య కావడంతో దాదాపు 8 నుంచి 10కోట్ల మంది భక్తజనం వస్తారని అంచనా. అందుకు తగ్గట్టుగానే భారీ బందోబస్తు, వసతి సౌతర్యాలను ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. నిరంతరంగా అందుబాటులో ఉండేలా భద్రతా బలగాలను మోహరించి..ఎలాంటి అవాంఛనీయా సంఘటనలు జరగకుండా పూర్తి భద్రత ఏర్పాట్లును పకడ్బందీగా చేసింది. మౌని అమవాస్యలో స్నానమాచరిస్తే పాపాలన్నీ హరిస్తాయని భక్తుల నమ్మకం. అందుకే అఘోరాలు, సామాన్యులు, నాగ సాధువులు, ఇతర సాధువులు ప్రయాగ్‌రాజ్ వెళ్లి స్నానమాచ రిస్తారు. ఈ శుభ ముహూర్తంలో పుణ్యస్నానం ఆచరించాలని చాలా మంది ఆసక్తిగా ప్రయాగ్ రాజ్ చేరుకున్నారు. ఈ పవిత్రమైన రోజున గంగా స్నానం చేస్తే ఎంతో పుణ్యం దక్కుతుందని భక్తుల నమ్మకం. మౌని అమావాస్య రోజు మౌన వ్రతం పాటించే సంప్రదాయం ఉంది. సాధకులు ఈ రోజున మౌనంగా ఉపవాసం పాటిస్తారు. ఇది ప్రధానంగా స్వీయ నియంత్రణతో పాటు మానసిక ప్రశాంతత కోసం చేస్తారు. ఈ ఉపవాసాన్ని రుషులు, సాధువులు కూడా ఆచరిస్తారు. ఎందుకంటే మౌనంగా ఉండటం వల్ల మనస్సును నియంత్రించడంతో పాటు ధ్యానంలో ఏకాగ్రత వస్తుంది. మౌని అమావాస్య ఉపవాసం కేవలం మతపరమైన ఆచారం మాత్రమే కాదు, స్వీయ నియంత్రణ, ధ్యానం ద్వారా మానసిక, ఆధ్యాత్మిక శాంతిని పొందే అవకాశాన్ని కూడా అందిస్తుంది. అంతటి ప్రాముఖ్యం ఉంది కాబట్టే భక్తులు మౌని అమవాస్యలో త్రివేణిసంగమంలో స్నానమాచరించేందుకు ప్రయాగ్‌రాజ్‌కు కోట్లాదిగా తరలివచ్చారు. ఈ క్రమంలో జరిగిన తొక్కిసలాట మహా విషాదాన్ని నింపింది.



# శాస్త్రవేత్తగా ఎదగాలి

**ట్రస్మా జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి చిలుకూరి రాధాకృష్ణ చారి**

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ :** విద్యార్థులు విద్యార్థి దశలోనే సృజనాత్మక తో నైపుణ్యాలను వెలికితీసి శాస్త్రవేత్తలుగా ఎదగాలని ట్రస్మా జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి , ప్రముఖ కవి , రచయిత చిలుకూరి రాధాకృష్ణ చారి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆసిఫాబాద్ మాడల్ స్కూల్ 8వ తరగతి చదువుతున్న సుమిత్ సోలంకి రూపొంన ఎలక్ట్రానిక్ హమ్మర్ పరికరం రాష్ట్రస్థాయి ఇన్స్పైర్ రాజస్థారియ బాల్ వైజ్ఞానిక ప్రదర్శనలో రాష్ట్ర స్థాయిలో ఎంపికైన నేపథ్యంలో విద్యార్థి సూరజ్ సోలంకిని జిల్లా సైన్స్ అధికారి కటకం మధుకర్ , పాఠశాల ప్రిన్సిపాల్ గైడ్ టీచర్ నరేందర్ కుమార్ , జీవశాస్త్ర ఉపాధ్యాయులు వడ్లూరి రాజేష్ తో కలసి ఘనంగా సన్మానించి అభినంచారు.

## నిజాన్ని నిర్భయంగా.. నిష్పక్షపాతంగా అద్దం పట్టేలా రాసిన రాతలే

# ప్రజల తలరాతలు మారుస్తాయి

**చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి**
**ఉద్యమ కెరటం దినపత్రిక క్యాలెండర్ ఆవిష్కరణ**



**ఉద్యమ కెరటం, మంచిర్యాల ప్రతినిధి:** నిజాన్ని నిర్భయంగా, నిష్పక్షపాతంగా అద్దం పట్టేలా రాసిన రాతలే ప్రజల తలరాతలు మారుస్తాయని చెన్నూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. మంచిర్యాలలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఉద్యమ కెరటం క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్తాపత్రికలు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య సందేశాలను ఇచ్చే చక్కటి సాధనాలని ప్రజాస్వామ్యంలో మూల స్తంభాలని,వార్తాపత్రికలలో వార్తలు నిష్పక్షపాతంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ అన్యాయం ఎండగట్టుతుండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యమ కెరటం స్టాఫ్ రిపోర్టర్ ఎఖతేదార్ అహ్మద్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రభాకర్ రావు, తుంగ పిండి రాజేష్, బండి సదానందం, అంబేద్కర్ సేన జిల్లా అధ్యక్షుడు పసుపాటి రమేష్ టీ. రాము, కొలిపాక సాంబయ్య, శ్రీనివాస్, మైనార్టీ సెల్ కోఆర్డినేటర్ అక్రమ్ బాబా తదితరులు పాల్గొన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో ఇద్దరికి బెయిల్ మంజూరు



**హైదరాబాద్,జనవరి30 :** రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇద్దరికి బెయిల్ మంజూరు అయ్యింది. ఈ కేసులో కీలక నిందితులుగా ఉన్న టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్ రావు, అడిషనల్ ఎస్పీ భుజంగరావుకు తెలంగాణ హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. లక్ష రూపాయలతో కూడిన 2 షూరిటీలూ సమర్పించాలని న్యాయస్థానం షరతు విధించింది. అలాగే వ్యక్తిగతమైన పాస్ పోర్టులు సమర్పించాలని ఇద్దరికీ ధర్మాసనం ఆదేశించింది. ఈ కేసులో పోలీసుల దర్యాప్తునకు సహకరించాలని, ఎక్కడా కూడా సాక్షులను ప్రభావితం చేయవద్దని భుజంగరావు, రాధాకిషన్ రావుకు తెలంగాణ హైకోర్టు పేర్కొంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో భుజంగరావు ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను ఆధారంగా చేసుకుని చాలా కీలకమైన అంశాలు బయటపడ్డ విషయం తెలిసిందే. ఎన్నికల సమయంలో రాజకీయ నేతల ఫోన్లు ట్యాపింగ్ చేయడంలో టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్ రావు పాత్ర ఉందని దర్యాప్తు అధికారులు నిర్ధారించారు. నాంపల్లి కోర్టు వీరి బెయిల్ పిటిషన్‌ను రెండు సార్లు తిరస్కరించింది. దీంతో తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు ఇద్దరు. ఈ కేసులో పదినెలలకు పైగా జైలులో ఉన్నామని, అనారోగ్య పరిస్థితుల దృష్ట్యా బెయిల్ మంజూరు చేయాలని ఇరువురు హైకోర్టును కోరారు. వారి ఆరోగ్య పరిస్థితిని పరిగణలోకి తీసుకున్న న్యాయస్థానం ఇద్దరికీ బెయిల్ మంజూరు చేసింది. అలాగే ఈకేసులో ఇంకా విచారణ సాగుతోందని, ఎక్కడా కూడా సాక్షులను ప్రభావితం చేయవద్దని, దర్యాప్తు అధికారులను కూడా ప్రభావితం చేసేలా ప్రయత్నిస్తే చర్యలు తప్పవని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. విదేశాలకు పారిపోయేందుకు అవకాశం ఉందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపించడంతో వారి వ్యక్తిగతమైన పాస్ట్‌పోర్టులను సమర్పించాలని ఆదేశించింది. పోలీసులు ఎప్పుడు పిలిచినా వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని భుజంగరావు, రాధాకిషన్‌రావుకు ఆదేశాలు జారీచేసింది. ఇప్పటికే అనారోగ్య కారణాలతో రాధాకిషన్‌రావు ముందస్తు బెయిల్‌పై ఉన్నారు. ప్రస్తుతం హైకోర్ట్ బెయిల్ మంజూరు చేయడంతో భుజంగరావు రేపు (శనివారం) ఉదయం బెయిల్‌పై విడుదలయ్యే అవకాశం ఉంది.

# సచివాలయంలో నకిలీ ఉద్యోగుల హల్‌చల్

**ఉద్యోగుల పేరుతో దర్జాగా చక్కర్లు**

**హైదరాబాద్, జనవరి 30 :** తెలంగాణ సచివాలయంలో నకిలీ ఉద్యోగుల వ్యవహారం కలకలం రేపింది. ఫేక్ ఐడెంటిటీ కార్డులతో సచివాలయంలోకి ఎంట్రీ ఇచ్చిన సదరు వ్యక్తులు.. ఉద్యోగుల పేరిట దర్జాగా తిరుగుతూ సెక్షన్ ఆఫీసుల్లో హల్‌చల్ చేశారు. సెక్షన్ ఆఫీసుల్లో పనులు చేపిస్తామంటూ దందాలకు దిగారు. నకిలీ ఉద్యోగుల సమాచారంతో సచివాలయ భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. నకిలీ ఉద్యోగుల కదలికలపై సెక్రటేరియట్ సిఎస్ఓ దేవిదాస్ ఆదేశాల మేరకు ఇంటెలిజెన్స్ నిఘా పెట్టింది. పూర్తి ఆధారాలు సేకరించిన తర్వాత ఎంతో చాకచక్యంగా ఓ నకిలీ ఉద్యోగిని ఎస్పీఎఫ్ ఇంటెలిజెన్స్ ఏఎస్ఐ యూసుఫ్,హెడ్ కానిస్టేబుల్ ఆంజనేయులు పట్టుకున్నారు. ఖమ్మంకు చెందిన భాస్కర్ రావు... రెవెన్యూ శాఖలో ఉద్యోగిగా ఫేక్ ఐడీ కార్డుతో చలామణి అవుతున్నట్లు గుర్తించారు. మైనార్టీ డిపార్ట్మెంట్ సెక్షన్ ఆఫీసర్ వి. ప్రశాంత్ డ్రైవర్ రవి.. భాస్కర్ రావు ఫేక్ ఐడి కార్డు తయారు చేసినట్లు ఎస్పీఎఫ్ ఇంటెలిజెన్స్ గుర్తించింది. ఈ క్రమంలో డ్రైవర్ రవిని కూడా ఎస్పీఎఫ్ ఇంటెలిజెన్స్ అదుపులోకి తీసుకుంది. రెవెన్యూ శాఖ జూనియర్ అసిస్టెంట్‌గా ఫేక్ ఐడీ కార్డుతో చలామణి అవుతున్న భాస్కర్ రావు, డ్రైవర్ రవిని ఇంటెలిజెన్స్ ఫిర్యాదుతో సైఫాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. రాష్ట్ర పరిపాలన వ్యవహారాలన్నీ సచివాలయం నుంచే నడుస్తుంటాయి. సీఎం, మంత్రులు, విభాగాధిపతులు అంతా ఇక్కడే ఉన్న నేపథ్యంలో ఎంట్రీపై కొంత నియంత్రణ ఉంటుంది. ఉద్యోగులతో పాటు మంత్రులను కలవాలనుకునే విసిటర్స్.. ఓ పద్దతి ప్రకారం పాసులు తీసుకుని లోపలికి వెళ్ళ్సి ఉంటుంది. కానీ ఇటీవలి కాలంలో అన్ని ఫ్లోర్లలో విజిటర్స్ సంఖ్య ఎక్కువగా ఉంటోంది. ఈ క్రమంలో పాసులు ఉన్నవారినే లోపలికి అనుమతిస్తూ నిఘాను పెంచారు సచివాలయ భద్రతా సిబ్బంది. ఈ నేపథ్యంలో ఉద్యోగుల పేరుతో నకిలీ ఐడెంటిటీ కార్డులతో కొందరు వ్యక్తులు లోపలికి వెళ్తున్న విషయం బయటకు వచ్చింది. కొంతమంది ఫేక్ ఐడెంటికీ కార్డుతో లోపలికి ప్రవేశించి ఎంతో దర్జాగా సెక్షన్ ఆఫీసుల్లో తిరుగుతూ దందాలు చేస్తున్న పరిస్థితి. ఈ విషయం సచివాలయ భద్రతా సిబ్బంది దృష్టికి వచ్చింది. దీంతో ఇంటెలిజన్స్ అధికారులు ఎంతో చాకచక్యంగా నకిలీ ఉద్యోగులను పట్టుకున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ మీడియా సమావేశంలో ఉద్యోగి పేరిట హల్‌చల్ చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తే అసలు విషయం బట్టబయలైంది. నకిలీ ఐడెంటిటీ కార్డుతో చలామణి అవుతున్న విషయం బయటపడింది. ఖమ్మం జిల్లాకు చెందిన భాస్కర్ అనే వ్యక్తి రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగిగా నకిలీ ఐడెంటిటీకార్డు తీసుకుని సెక్షన్‌లో దర్జాగా తిరుగుతున్నట్లు ఇంటెలిజెన్స్ గుర్తించారు. ఇతనికి సహకరించిన రవి అనే వ్యక్తిని కూడా అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు పోలీసులు.

# రసాభాసగా జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ మీటింగ్

- **మేయర్ పోడియంపైకి ప్లకార్డులను విసిరేసిన కార్పొరేటర్లు**
- **మేయర్‌ను అడ్డుకున్న బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు**
- **తోసేసుకున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్పొరేటర్లు**



**హైదరాబాద్,జనవరి 30 :** జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ మీటింగ్ సమావేశం రసాభాసగా మారింది. మేయర్ గద్వాల విజయలక్ష్మి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం గురువారం ఉదయం ప్రారంభమైంది. అయితే సమావేశం మొదలైన వెంటనే గందరగోళ పరిస్థితి నెలకొంది. ముందుగా బడ్జెట్ ప్రవేశపెడుతామని మేయర్ చెప్పగా.. అందుకు బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు ససేమిరా అన్నారు. ముందు ప్రజా సమస్యలపై మాట్లాడాలని రెండు పార్టీల సభ్యులు పట్టుబట్టారు. ప్లకార్డులు పట్టుకుని మేయర్ పోడియం వద్దకు వచ్చిన బీఆర్ఎస్ కార్పొరేటర్లను కాంగ్రెస్ కార్పొరేటర్లు అడ్డుకున్నారు. కాంగ్రెస్ కార్పొరేటర్లు సీఎన్ రెడ్డి, బాబా ఫసియుద్దీన్.. బీఆర్ఎస్ సభ్యుల నుంచి ప్లకార్డులను లాక్కొని చించేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్పొరేటర్ల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఇరు పార్టీల కార్పొరేటర్లు ఒకరినొకరు తోసేసుకున్నారు. సమావేశం మొదలైన ఐదు నిమిషాల్లోనే తీవ్ర గందరగోళం నెలకొనడంతో మార్షల్స్ కౌన్సిల్ మీటింగ్‌లోకి ప్రవేశించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్పొరేటర్లు ఒకరినొకరు తోసుకోవడంతో పాటు దుర్భాషలాడుకున్నారు. మేయర్ పోడియంపై బీఆర్ఎస్ సభ్యులు ప్లకార్డులు విసిరారు. వెంటనే మార్షల్స్ అక్కడకు చేరుకుని బీఆర్ఎస్ కార్పొరేటర్లను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను రాష్ట్రంలో అమలుకావడం లేదని, గ్రేటర్ హైదరాబాద్‌లో నిధులు ఎక్కడికక్కడ దుర్వినియోగం అవుతున్నాయని బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఆరోపిస్తున్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగట్లేదని బీఆర్ఎస్ కార్పొరేటర్లు ప్లకార్డులు పట్టుకుని కౌన్సిల్ మీటింగ్‌కు వచ్చారు. మేయర్ వద్దకు దూసుకెళ్తున్న క్రమంలో కాంగ్రెస్ కార్పొరేటర్లు సీఎన్ రెడ్డి, బాబా ఫసియుద్దీన్ వారిని అడ్డుకున్నారు. వెంటనే మార్షల్స్ అక్కడకు చేరుకుని బీఆర్ఎస్ కార్పొరేటర్లను అరెస్ట్ చేశారు. మరోవైపు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలపై బీఆర్ఎస్ కార్పొరేటర్లు విరుచుకుపడుతున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు ఒకటే అని అందుకే సమావేశం ముందుకు జరగకుండా ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నారని కమలం పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు.



**ఉద్యమ కెరటం, దహేగాం:** దహేగాం మండల కేంద్రంలో గురువారం ఆదివాసీ కొలవార్ సంక్షేమ సంఘం దహేగాం మండల నాయకులు, యువకులు జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆదివాసీ కొలవార్ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు టేకం సుధాకర్ మాట్లాడుతూ ఆంగ్లేయుల పాలననుండి భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించిన నాయకులలో అగ్రగణ్యుడన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు బుర్స రవీందర్, ఉపాధ్యక్షులు తుమ్మిడి సత్తయ్య, యువజన ఉపాధ్యక్షుడు బొరేం శంకర్, యువజన ప్రధాన కార్యదర్శి నల్లి దామోదర్, యువజన సహాయక కార్యదర్శి బొట్లకుంట అంజి, యువజన సాంస్కృతిక కార్యదర్శి బుర్రి రాము, సోషల్ మీడియా కన్వీనర్ కాసం అంజి, నాయకులు తుమ్మిడి సత్యం, ఎడ్ల తిరుపతి, బొట్లకుంట సురేష్, చింతపూడి సాయి తదితరులు పాల్గొన్నారు.

# మహాత్ముడికి ఊరూరా ఘన నివాళి



**ఉద్యమ కెరటం, బెల్లంపల్లి:** బెల్లంపల్లి కాంగ్రెస్ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి దండ వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశం కోసం ప్రాణాలు అర్పించిన మహనీయుడు.. సత్యం, ధర్మం, అహింస మార్గంలో నడిచి అందరి మదిలో చిరస్థాయిగా నిలిచిన గొప్ప మహానుభావుడు అని కొనియాడారు. ఆయన అడుగుజాడల్లో అందరు నడవాలని పిలుపునిచ్చారు.


## హామీలు నెరవేర్చాలని వినతి




**ఉద్యమ కెరటం, బెల్లంపల్లి:** కేటీఆర్ పిలుపు మేరకు బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు బడికల శ్రావణ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా దుర్గం చిన్నయ్య, జిల్లా అధ్యక్షులు బడికల శ్రావణ్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 420 రోజులు పూర్తయినా 2023 ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీల్లో ఏ ఒక్కదాన్ని కూడా అమలు చేయకపోవడంతో నిరసనగా ప్లకార్డులు పట్టుకొని ఆందోళన వ్యక్తం చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఇది కాంగ్రెస్ పార్టీ ప్రజల పట్ల చిత్తశుద్ధి లేకపోవడానికి నిదర్శనమని అన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని,లేకపోతే ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కొవాల్సి ఉంటుందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ తొంగల సత్యనారాయణ, మాజీ ఎంపీపీ సుభాష్ రావు, బీఆర్ఎస్ బెల్లంపల్లి మండల అధ్యక్షులు గణేష్ గౌడ్, బీఆర్ఎస్వీ బెల్లంపల్లి పట్టణ అధ్యక్షులు అరుణ్, బీఆర్ఎస్వీ తాండూరు మండల అధ్యక్షుడు శ్రీకాంత్, బీఆర్ఎస్ యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు సబ్బని అరుణ్, మాజీ సర్పంచ్ క్రిష్ణ మూర్తి, మైనార్టీ అధ్యక్షుడు అలీ భాయ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సుందర్ రావు, గోలి శివ, మల్లేష్, తొంగల రాజేశం, సుదర్శన్, మద్దెల గోపి, చంద్రశేఖర్, దాసరి సతీష్, నాయకులు పాల్గొన్నారు.



**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** మండల కేంద్రంలో ఆర్యవైశ్యులు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల వైశ్య సంఘం నాయకులు రాచకొండ శ్రీవర్ధన్, భోగ రమేష్, సామల కిరణ్ కుమార్, మధ్యర్ల వెంకన్న, యాద సంతోష్, తంగడిపల్లి నీలేష్ మహిళలు తదితరులు పాల్గొన్నారు.



**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** మండల కేంద్రంలో గురువారం గాంధీ విగ్రహానికి పూలమాల వేసి సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం ఏర్పాటు కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. స్వాతంత్ర పోరాటంలో మహాత్మా గాంధీ చేసిన కృషిని తెలిపారు. ఏ సమస్య వచ్చినా ఇబ్బందులు వచ్చినా గాంధేయ మార్గంలో శాంతియుతంగా పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాజపా జిల్లా ఎస్సీ మోర్చ అధ్యక్షులు కుమ్మరి తిరుపతి, మండల అధ్యక్షులు జాడి తిరుపతి, మాజీ సర్పంచ్లు వసీ ఉల్లాఖాన్, గూడ రాకేష్, భిక్షపతి, మెస్రం రాజారాం, జాడి దిగంబర్, కొప్పుల దిలీప్, సామల తిరుపతి, బాలకృష్ణ, నీలేష్, వెంకటేష్, శ్యామ్ సుందర్, సంతోష్, సంజీవ్, గోపాల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



**ఉద్యమ కెరటం, వాంకిడి:** సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు అబద్ధపు హామీలు ఇచ్చి మోసం చేస్తున్నారని వాంకుడి మండల మాజీ జెడ్పిటిసి , బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు డాక్టర్ అజయ్ కుమార్ ఆరోపించారు. గురువారం మండల కేంద్రంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం గాంధీ చిత్రపటానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 420 హామీలు ఇచ్చి అమలు చేయకపోవడం వలన తెలంగాణ ప్రజలను మోసం చేసిన సందర్భంగా నిరసనగా గాంధీజీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ పెంటు , పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**ఉద్యమ కెరటం,ఇంద్రవెల్లి:** అహింసాయుత మార్గాన్ని అనుసరించి ఆంగ్లేయుల పాలనను అంతమొందించిన స్వాత్రంత్ర్య సమర యోధుడు మహాత్మా గాంధీ సిద్ధాంతాలను,నేటి యువత అనుసరించాలని అవసరం ఎంతైనా ఉందని ఇంద్రవెల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖాడే ఉత్తం అన్నారు. గురువారం ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో మహాత్మా గాంధీ వర్ధంతి జరుపుకొన్నారు. ముందుగా మహాత్మా గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మారుతి,సెక్రటరీ దేవన్న,పట్టణ అధ్యక్షుడు ఎండి.జహీర్, డైరెక్టర్లు శ్రీకాంత్, ఆచపత్, ప్రకాశ్, మాణిక్ రావు, జంగు,ఆనందరావు,గణేష్,కైలాష్,కాంగ్రెస్ నాయకులు వరుణ్ ఫడ్ తదితరులు పాల్గొన్నారు.





**ఉద్యమ కెరటం, ఉట్నూర్:** దేశ స్వాతంత్ర్యానికి, తద్వారా జాతి నిర్మాణానికి మహాత్మా గాంధీ అందించిన అమూల్యమైన సేవలు, చేసిన త్యాగాలు అందరికీ ఆదర్శప్రాయం అని బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేష్ తెలిపారు. జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఉట్నూర్ మండలంలోని దంతాన్ పల్లిలో మహాత్మా గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమం మాజీ సర్పంచ్ జగన్నాథ్ రావు, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు సులేమాన్, దినేష్ సాయి సాజీద్, నదీమ్, సురేష్, ముఖీద్, అహ్మద్, నజీర్, సాబిర్ తదితరులు పాల్గొన్నారు.

## విగ్రహ పున:ప్రతిష్ఠకు కోనప్ప హాజరు



**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** మండలంలోని పెద్ద సిద్ధాపూర్ గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో ఎల్లారం పోచమ్మ తల్లి ఆలయంలో గురువారం అమ్మవారి విగ్రహ పుణ:ప్రతిష్ఠాపన జరిగింది. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజక వర్గ ప్రజల క్షేమంగా ఉండాలని, ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, కోనేరు అభిమానులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## మోసం చేయడంలో రేవంత్ దిట్ట



**ఉద్యమ కెరటం నేరడిగొండ:** ప్రజలను నమ్మించి మోసం చేయడంలో రేవంత్ రెడ్డి దిట్ట అని బీఆర్ఎస్ సోషల్ మీడియా నాయకులు మజర్ విమర్శించారు. గురువారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టడానికి అడ్డమైన 420 హామీలు ఇచ్చింది. అధికారంలోకి రాగానే మొదటి సంతకం రుణమాఫీపై చేస్తానని డిసంబర్ 9 తేదీన రైతులకు రుణమాఫీ పూర్తవుతుందని ఇలా రైతులనే కాకుండా అన్ని రంగాల్లో ప్రతి ఒక్కరికి నమ్మించి మోసం చేశారని అన్నారు. రైతు భరోసా అందిస్తామని జనవరి 26న ప్రారంభమని చెప్పి 26న ఆదివారం అని చెప్పి రాత్రి 12 అవగానే సోమవారం డబ్బులు టకి టకి అని పడతాయని చెప్పి నమ్మించారన్నారు. 27 జనవరి 12 గంటలకు టకి టకి అని సెల్ ఫోన్లలో రైతు భరోసా డబ్బులు పడతాయని చెప్పిన ముఖ్యమంత్రి ఎంబడే మాట మార్చి మళ్ళీ మార్చి 31 తారికు వరకు పొడగించారన్నారు. 26 జనవరి ఆదివారం అని ముఖ్యమంత్రి కి ముందు తెలీదా...?? ప్రపంచంలో రాత్రి 12 గంటలకు ఎక్కడైనా బ్యాంకులు తెరుస్తారా..?? అని ప్రశ్నించారు. పథకాలు అందజేయలేకనే ఇదంతా కేవలం ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని సోషల్ మీడియా నాయకులు తెలిపారు.

## 15న సెలవు ప్రకటించాలి



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** బంజారాల ఆరాధ్య దైవమైన సంత్ సేవలాల్ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని ఫిబ్రవరి 15న ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలాని లైవ్ జిల్లా అధ్యక్షులు మహేందర్ జాదవ్ డిమాండ్ చేశారు. గురువారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బంజారా జాతికి జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టాలని అన్నారు. సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించకపోతే లంబాడ జాతి ఐక్యత ఏకమై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పోరాటం ద్వారా ఉద్యమం చేయాల్సింది ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి పందు నాయక్, మండల ఇన్చార్జి సందీప్ నాయక్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, లంబాడ నాయకుడు తదితరులు ఉన్నారు.

## పోచమ్మ సల్లగా చూడమ్మా..

**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** మండలం చిన్న సిద్ధాపూర్ శివారులో వెలసిన ఎల్లారం పోచమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన మహొూత్సవంలో సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడ జరిగిన పూర్ణాహుతి, బోనాల పండుగలో పాలుపంచుకొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ... పోచమ్మ తల్లి నియోజక వర్గ ప్రజలను చల్లగా చూడాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కుమ్మరి తిరుపతి, మండల అధ్యక్షులు జాడి తిరుపతి, మాజీ ఎంపీపీ మనోహర్ గౌడ్, మాజీ సర్పంచ్లు వసీ ఉల్లాఖాన్, గూడ రాకేష్, భిక్షపతి, మెస్రం రాజారాం, జాడి దిగంబర్, కొప్పుల దిలీప్, సామల తిరుపతి, బాలకృష్ణ, నీలేష్, వెంకటేష్, శ్యామ్ సుందర్, సంతోష్, సంజీవ్, గోపాల్, మహేష్, రుషి తదితరులు పాల్గొన్నారు.



ఉద్యమ కెరటం
www.udyamakeratam.com
నిజం.. రక్షతి రక్షితః
తెలుగు దినపత్రిక
UDYAMA KERATAM TELUGU DAILY



# సీఎంను సన్మానిస్తాం

- మహిళా ఉపాధ్యాయ దినోత్సవం అభినందనీయం
- మాలి మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు



**ఉద్యమ కెరటం ఆదిలాబాద్ :** భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి జనవరి 3ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించినందుకు అభినందనియమని మాలి మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పెట్కులే హర్షం వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 10వ తేదీన అఖిల భారతీయ మాలీ మహా సంఘం జాతీయ నేతలు హైదరాబాదులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి ఘనంగా సన్మానించనున్నట్లు తెలిపారు. దానికి కావాల్సిన అపాయింట్మెంట్ఇప్పించాలని కాంగ్రెస్ ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయం ప్రజా భవన్ లో కలిసి మాలి మహా సంఘం నేతలు విన్నవించారు. ఈ సందర్భంగా గత 24 సంవత్సరాలుగా మాలీలు చేస్తున్న సామాజిక న్యాయ పోరాటాన్ని వివరించి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా కంది శ్రేణినివాస్ రెడ్డి మాట్లాడుతూ మాలి కులస్తులు తమ హక్కుల సాధన కోసం అనేక సంవత్సరాలుగా పోరాడుతున్నారని అంతేకాకుండా మహాత్మ జ్యోతిరావు పూలే దంపతులు చేసిన సామాజిక సేవా కార్యక్రమాలను ప్రజల్లో తీసుకెళ్లడంలో ముందు వరుసలో ఉంటున్నారని, తప్పకుండా రేపు జిల్లా కేంద్రానికి వస్తున్న జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క తో మాట్లాడి ఫిబ్రవరి 10వ తేదీన మాలి మహా సంగ జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసే ఏర్పాటు చేస్తా నని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాలీ మహా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న శేండే, రాష్ట్ర కోశాధికారి సతీష్ గురుణులే, జిల్లా అధ్యక్షులు విజయ్ వాడగురే, జిల్లా పటేళ్ల సంఘం అధ్యక్షులు గంగారం శేండే, జిల్లా కార్యవర్గ సభ్యులు ధనంజయ ప్రధాన్, గజానన్ చౌదరి, మాలీ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్ అంబేకర్, సుభాష్ శేండే, శ్రీను ఆచారి తదితరులు పాల్గొన్నారు.

# స్టడీ మెటీరియల్ అందజేత



**ఉద్యమ కెరటం, నర్సాపూర్(జీ):** నర్సాపూర్(జీ) మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో 17 మంది విద్యార్థులకు గురువారం ఎంఐఎం ఆధ్వర్యంలో సాలారే మిల్లత్ స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఎంఐఎం నిర్మల్ అధ్యక్షుడు అజీమ్ బిన్ యహ్యా మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలను కైవసం చేసుకోవాలని సూచించారు. ఇందులో నాయకులు తాజా మాజీ కౌన్సిలర్ అబ్రారుల్ హసన్, ఎంఐఎం టౌన్ జాయింట్ సెక్రెటరీ సయ్యద్ చాంద్ పాషా, తయ్యబ్ బిన్ సల్హ , పాధ్యాయులు విజయ, గంగారం, అజహరుద్దీన్, అప్సానా నేహాల్, సపోరా ఫాతిమా, సాజిత్, మొహిద్దిన్ ,నిస్సార్ ఫాతిమా ,సయ్యద్ సర్పరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# రేపు కొండయ్య మహారాజ్ జయంతి

**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ మండలం చౌటపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని లింగ దరి గూడెం గ్రామంలో ఫిబ్రవరి 1న సంత పరమహంస కొండయ్య మహారాజ్ భవ్య జన్మ జయంతి మహోత్సవం నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఒక పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం ఉదయం 4 గంటలకు మేలుకొలుపు సుప్రభాతం, 6గంటలకు అభిషేకం, 11గంటలకు ధ్వజరోహణం, సాయంత్రం 4 నుండి అన్నదానం, సాయంత్రం 6 గంటల నుంచి భజన కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు.

# ఉత్తమ సోషల్ వర్కర్‌గా డోంగ్రి ప్రవీణ్ కుమార్

**ఉద్యమ కెరటం, కాగజ్ నగర్ టౌన్ :** జిల్లా బాలల సంరక్షణ విభాగంలో పనిచేస్తున్న సోషల్ వర్కర్ డోంగ్రి ప్రవీణ్ కుమార్ విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసినందుకు ఉత్తమ సోషల్ వర్కర్ గా 76వ గణతంత్ర దినోత్సవం రోజును కలెక్టర్ వెంకటేష్ దోత్రే చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను బాలల సంరక్షణ కార్యాలయ సిబ్బంది , మిత్రులు,పలువురు ఆయనను అభినందించారు.





# బండి వ్యాఖ్యలకు ఆదివాసీల ఖండన

**ఉద్యమ కెరటం, నిర్మల్ :** పద్మశ్రీ అవార్డు ఎంపిక నేపథ్యంలో గద్దర్ పై కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను ఆదివాసీ కాంగ్రెస్ పార్టీ జిల్లా చైర్మన్ బాణావత్ గోవింద్ నాయక్ ఆత్రం రాజేశ్వర్ తీవ్రంగా ఖండించారు. గురువారం ఖానాపూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గద్దర్ పదవుల కోసమో,డబ్బు కోసమో,అవార్డుల కోసమో తన జీవితాన్ని ఫణంగా పెట్టి పని చేయలేదని అన్నారు. తెలంగాణ కోసం, పీడిత,పేద ప్రజల కోసం,అణగారిన వర్గాలు, మహిళల కోసం గద్దర్ పోరాడారని గుర్తు చేశారు. ప్రజల పాటగా ఆయన చిరస్మరణీయుడని..ఆయన స్థాయిని అవార్డులు నిర్ణయించలేవన్నారు. అసలు పద్మ అవార్డులు ఇచ్చేది కేంద్ర ప్రభుత్వమా ? లేక బీజేపీ పార్టీనా? అని ప్రశ్నించారు. వివిధ రంగాల్లో దేశానికి సేవలందించిన ప్రముఖులను గుర్తించి ఇచ్చేందుకు తగిన మార్గదర్శకాలు ఉన్నాయని, అలాంటప్పుడు బండి సంజయ్ తమ పార్టీ కార్యకర్తలను చంపినోళ్లకు అవార్డులు ఎలా ఇస్తారంటూ మాట్లాడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పద్మశ్రీ అవార్డులు అధికార పార్టీలు ఎంపిక చేసిన వారికే ఇస్తారా.. లేక సమాజానికి, దేశానికి విశిష్ట సేవలందించిన సామాన్యులకు కూడా ఇస్తారా..అన్నదానిపై కేంద్రం ప్రజలకు సమాధానం చెప్పాల్సి ఉందన్నారు. ఈ సమావేశంలో పలువురు నాయకులు ఉన్నారు.



# ప్రాజెక్టు నిధులు మంజూరు చేయండి

**ఉద్యమ కెరటం, బెల్లంపల్లి:** బెల్లంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి, ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేయాలని మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావును బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కోరారు. గురువారం హైదరాబాద్‌లో మంత్రులను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఓబీసీ స్టేట్ వైస్ చైర్మన్ బండి ప్రభాకర్ యాదవ్, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి జమ్మికుంట విజయ్ పాల్గొన్నారు.



# సీఎం, ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం



**ఉద్యమ కెరటం, తాండూర్:** బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి చొరవతోనే తాండూర్ మండలానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరైందని కాంగ్రెస్ మండల నాయకులు తెలిపారు. గురువారం తాండూర్ మండల కేంద్రంలోని ఐబీ లో సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి చిత్రపటానికి కాంగ్రెస్ మండల నాయకులు పాలాభిషేకం చేశారు. నిరంతరం తాండూర్ మండల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ,అలుపెరుగని పోరాటం చేస్తున్న ఎమ్మెల్యేకు ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ తాండూర్ మండల్ అధ్యక్షుడు ఎండీ ఈసా, కాంగ్రెస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు ఎస్ రవీందర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎస్ మహేందర్ రావు, మాజీ ఎంపీటీసీ సిరంగిశంకర్, నాయకులు కే రత్నాకర్ రావు, సూరం దామోదర్ రెడ్డి, మామిడాల రాజేశం, మద్దికుంట రామచందర్, శంకర్ గౌడ్, మసాడి తిరుపతి,పెట్టెం విష్ణు కల్యాణ్, ఎండీ జుబేర్, షేక్ మోమిన్ అలీ, పుట్ట శీను, డాక్టర్ శంకర్, దుర్గం మహేందర్,ఆయుబ్ ఖాన్, శ్రీధర్, ఆదామ్, రఘు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



**ఉద్యమ కెరటం, తాండూర్:** బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశానుసారం కొత్తపల్లి గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన ఉప్పుల బక్కమ్మ కు ప్రభుత్వం మంజూరు చేసిన ముఖ్యమంత్రి సహాయ నిధి చేక్కును మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఎస్ రవీందర్ రెడ్డి గురువారం కొత్తపల్లి గ్రామంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# మూడు కొలువులు సాధించిన యువకుడు

**ఉద్యమ కెరటం, దహెగాం:** ప్రభుత్వ కొలువు సాదించాలంటే చాలా కష్టపడాలి.. ఎంతో ఓపిక ఉండాలి.. ఈ రోజుల్లో ఒక ప్రభుత్వ ఉద్యగం సాధించడమే కష్టం.. అలాంటిది కుమ్రంభీం ఆసిఫాబాద్‌జిల్లా దహెగాం మండలం పెసరి కుంట గ్రామానికి చెందిన కామెర రాంచందర్ ఏకంగా మూడు ప్రభుత్వం ఉద్యోగాలు సాధించాడు. ఆయనది వ్యవసాయ కుటుంబం కాగా, చదివిందంతా ప్రభుత్వ పాఠశాలలోనే. చిన్నప్పటి నుండి చాలా కష్టపడి చదివి మూడు ప్రభుత్వ కొలువులు సాధించి యువతకు ఆదర్శంగా నిలిచాడు. ఎస్జీటీ,గ్రూప్ 4 జూనియర్ అసిస్టెంట్ (వైద్య విధాన పరిషత్) ఉద్యోగం, ఎన్పీడీసీఎల్‌లో జూనియర్ అసిస్టెంట్ కొలువులు సాధించారు. ప్రస్తుతం అతను ఎన్పీడీసీఎల్ జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఆసిఫాబాద్ లో చేస్తున్నాడు.

# అక్రమ నిర్మాణాల తొలగింపు

**కాగజ్ నగర్ మున్సిపల్ కమిషనర్ అంజయ్య**

**ఉద్యమ కెరటం, కాగజ్ నగర్ :** కాగజ్ నగర్ మున్సిపల్ పరిధిలో ప్రభుత్వ భూమిలో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను తొలగించినట్టు కాగజ్ నగర్ మున్సిపల్ కమిషనర్ అంజయ్య తెలిపారు. గురువారం జిల్లాలోని కాగజ్ నగర్ పట్టణంలోని బస్టాండ్ వెనుక గల సర్వేనెంబర్ 143లో మున్సిపల్ నైట్ షెల్టర్ కోసం కేటాయించిన ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన బేస్ మెంట్, రోడ్డును ఆక్రమించి చేపట్టిన షెడ్ తోపాటు ఇట్టి భూమిలో రోడ్డును ఆక్రమించే నిర్మించిన నిర్మాణాన్ని తొలగించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ భూములలో అక్రమ నిర్మాణాలు చేపట్టవద్దని, నిబంధనలు ముల్లంగించి నట్లైతే చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ, పట్టణ ప్రణాళిక అధికారి యశ్వంత్, ఎస్ఐ, మున్సిపల్, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఉద్యమ కెరటం
www.udyamakeratam.com
నిజం.. రక్షతి రక్షితః
తెలుగు దినపత్రిక
UDYAMA KERATAM TELUGU DAILY





# ఐక్యతతోనే హక్కులు సాధించవచ్చు

## టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ రహమాన్, సంపత్ కుమార్

**ఉద్యమ కెరటం, పెంచికల్‌పేట్/దహేగాం :** ఐక్యతతోనే జర్నలిస్టులు హక్కులు సాధించవచ్చు అని టియుడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ సంపత్ కుమార్ అన్నారు. గురువారం పెంచికల్ పేట్ ప్రెస్ క్లబ్ లో , దహేగాంలో టియుడబ్ల్యూజే సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం నిరంతరం అక్రిడేషన్లు, హెల్త్ కార్డులు, నివాస స్థలాల సాధన విషయంలో నిరంతరం రాజీ లేని పోరాటం టియుడబ్ల్యూజే ( ఐజేయు) చేస్తుందని అన్నారు. రానున్న రోజుల్లో జర్నలిస్టుల సంక్షేమం కోసం పెద్ద ఎత్తున పోరాటాలు చేసి లక్ష్యాలను చేరుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అక్రిడేషన్ కమిటీ మెంబర్ ప్రకాష్ గౌడ్, టీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సభ్యులు నామ తిరుపతి, టీయూడబ్ల్యూజే నాయకుడు మిలిన్ కుమార్,పాత్రికేయులు నారా తిరుపతి , శ్రీధర్ , కమలాకర్ , రాజేష్ , రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# క్షుద్ర పూజలకు సమాధి తవ్విన వ్యక్తుల అరెస్టు



**ఉద్యమ కెరటం, బెజ్జూర్ :** మండలంలోని ఏటిగూడ గ్రామానికి చెందిన ఎర్నాగి చిన్నయ్య 14 రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందగాచ అదే గ్రామానికి చెందిన గెడం రావుజి మరికొంతమందితో కలిసి గుప్త నిధుల కోసం, క్షుద్ర పూజల కోసం చిన్నయ్య సమాధిని తవ్వి ఐదు ఎముకలను తీసినట్లుగా సీఐ ముత్యం రమేష్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఈ నెల 28న మౌని అమావాస్య రోజున కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు ఎర్నాగి చిన్నన్న సమాధిని తవ్వి ఐదు ఎముకలు తీసినట్లుగా గుర్తించిన స్థానికులు కుటుంబ సభ్యులకు తెలుపగా, బెజ్జూర్ పోలీస్ స్టేషన్‌లో 29న ఫిర్యాదు చేశారన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ ప్రవీణ్ గురువారం కృష్ణపల్లి గ్రామ శివారులో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా, ఒక కారులో ఐదుగురు కొత్త వ్యక్తులు ఉన్నట్లుగా గుర్తించారు. ఇనుగుర్తి రమేష్(బెజ్జూర్), కాసారపు పరమేశ్వర్(రాంనగర్ కరీంనగర్), ఆత్రం శంకర్ డబ్బాయి(బెజ్జూర్), గేయడం రావుజి(హేటిగూడ, బెజ్జూర్), గొర్లె రాజు (కొక్కెరకుంట, కరీంనగర్)ను విచారించగా, చిన్నన్న సమాధిని తవ్వి ఎముకలు తీసుకున్నామని నేరాన్ని ఒప్పుకున్నట్లుగా సీఐ రమేష్ తెలిపారు. వారిని అదుపులో తీసుకొని కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పర్చగా, సిర్పూర్ న్యాయమూర్తి ఉల్లం అజయ్ 14 రోజుల రిమాండ్ విధించినట్లుగా ఎస్పై కొట్టే ప్రవీణ్ తెలిపారు.

# జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యం

## టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి రహమాన్, సంపత్

**ఉద్యమ కెరటం, కాగజ్ నగర్:** జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ఏకైక యూనియన్ టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ సంపత్ కుమార్ అన్నారు. గురువారం కాగజ్‌నగర్‌రిటైర్డ్ ఎంప్లాయిస్ భవనంలో టీయూడబ్ల్యూజే సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం నిరంతరం అక్రిడిటేషన్లు, హెల్త్ కార్డులు, నివాస స్థలాల సాధన విషయంలో నిరంతరం రాజీ లేని పోరాటం టీయూడబ్ల్యూజే (ఐజేయూ) చేస్తుందన్నారు. రానున్న రోజుల్లో జర్నలిస్టుల సంక్షేమం కోసం పెద్ద ఎత్తున పోరాటాలు చేసి లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అక్రిడిటేషన్ కమిటీ మెంబర్ ప్రకాష్ గౌడ్, సీనియర్ జర్నలిస్టులు గంధం శ్రీనివాస్, వెంకన్న, తిరుపతి, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రత్నాకర్, టీయూడబ్ల్యూజే నాయకులు జలీల్ బేగ్, షఫీ ఉల్లా బేగ్, పాత్రికేయులు ముఖశీర్ హుస్సేన్, యూసుఫ్, ముఫక్కం, అర్షద్, వసీ ఖాన్, నవజిష్ హాష్మీ, అబ్దుల్ సమీర్, ఫారూఖ్, అహ్మద్ అమీన్, నసీర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.





# బీజేపీ అభ్యర్థిని గెలిపించాలి

**ఉద్యమ కెరటం, తిర్యాణి:** రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపునకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం కొమురంభీం ఆసిఫాబాద్‌జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికల కార్యశాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎమ్మెల్సీ ఎలక్షన్ అభ్యర్థులు అంజి రెడీ, మల్కా కొమరయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల మాజీ అధ్యక్షుడు పులి వెంకటేష్ మాట్లాడుతూ రానున్న ఎమ్మెల్సీ ఎలక్షన్‌లో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎలక్షన్ అభ్యర్థి అంజి రెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీ ఎలక్షన్ మల్కా కొమురయ్యను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జిల్లా పదాధికారులు ఎమ్మెల్సీ ఎలక్షన్ కన్వీనర్లు కో కన్వీనర్ల బీజేపీ నాయకులు కార్య కర్తలు ఉన్నారు.



# నాగోబా జాతరలో సాంస్కృతిక కార్యక్రమాలు

## తొలిసారిగా అంగరంగ వైభవంగా నిర్వహణ

## ప్రారంభించిన కలెక్టర్, ఎస్పీ, ఐటీడీఏ పీవో

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్ :** ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ నాగోబా జాతరలో మొదటి సారి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం ఈ వేడుకను కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్‌ఆలం, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, వెంకట్ రావ్ పటేల్ ప్రారంభించారు. ఆదివాసీ సంప్రదాయాలు ఉట్టిపడేలా కళాకారులు నృత్యాలు ప్రదర్శించారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ఈ వేడుకలను తిలకించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ యువరాజ్, ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్, ఆలయ కమిటీ సభ్యులు, జిల్లా అధికారులు తదితరులు ఉన్నారు.





**ఉద్యమ కెరటం, నర్సాపూర్(జీ):** మండల కేంద్రంలో ఉపాధి హామీ పథకం ఏపీఓ జగన్నాథం గురువారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు సంబంధించిన దరఖాస్తుల పరిశీలనలో పారదర్శకతతో పని చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో టీఏలు రవీందర్, సతీష్, కంప్యూటర్ ఆపరేటర్ గిరి, వివిధ గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



# జాతరలో కలెక్టర్ దంపతులు

నాగోబా జాతరలో గురువారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో గురువారం రాత్రి కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే దంపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పి గౌస్ ఆలం, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థల ) దీపక్ తివారి తదితరులు ఉన్నారు.

- ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్

# బీజేపీ మండల అధ్యక్షుడిగా నరేందర్




**ఉద్యమ కెరటం, నర్సాపూర్(జీ):** బీజేపీ నర్సాపూర్(జీ) మండల అధ్యక్షుడిగా బర్కుంట నరేందర్ ను నియమించారు.సమస్యల పరిష్కారం కోసం అభివృద్ధి కోసం పార్టీ బలోపేతం కోసం పాటుపడతానని నరేందర్ పేర్కొన్నారు. మండల అధ్యక్షుడిగా ఎన్నికైన నరేందర్ ను మండలంలోని పలువురు నాయకులు మండల ప్రజలు అభినందనలు తెలిపారు.



# కనక రాజు లోటు తీర్చలేనిది

## మంత్రి సీతక్క

**ఉద్యమ కెరటం, జైనూర్:** జైనూర్ మండలం మర్లవాయి గ్రామానికి చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీత, గుస్సాడి కళాకారుడు కనక రాజు సంతాప సభలో రాష్ట్ర మంత్రి సీతక్క పాల్గొన్నారు. పద్మశ్రీ కనకరాజు చిత్ర పటానికి నివాళులర్పించి, మాట్లాడారు. గొప్ప కళాకారున్నీ కోల్పోయామని, దేశం గుర్తించేలా గుస్సాడి నృత్యాన్ని ముందుకు తీసుకెళ్లారని తెలిపారు. హైమన్ డార్ఫ్ దంపతులు ఇక్కడి సంప్రదాయం, సంస్కృతికి ఆకర్షితులై ఇక్కడే స్థిరనివాసం ఏర్పరుచుకున్నరన్నారు. ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలను తన శ్వాసగా భావించి, మారుమూల ప్రాంతంలో ఉండి దేశ స్థాయికి గుస్సాడి నృత్యాన్ని తీసుకెళ్లిన ఘనత పద్మశ్రీ అవార్డు గ్రహీత కనక రాజుది అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విట్టల్, జీసీసీ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ తిరుపతి, టీపీసీసీ జనరల్ సెక్రటరీ, కరీంనగర్ జిల్లా గ్రంథాలయ చైర్మన్‌సత్తు మల్లేష్, ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణ, ప్రజాప్రతినిధులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థి దశ నుండి ప్రకృతిపై అవగాహన ఉండాలి

## జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్ కుమార్


**ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్ :** విద్యార్థి దశ నుండి ప్రకృతిపై అవగాహన ఉండాలని జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్ కుమార్ తెలిపారు. కాగజ్ నగర్ డివిజన్ పరిధిలోని వేంపల్లి లో అటవీశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన వన సందర్శన కార్యక్రమాన్ని ఎఫ్‌డీవో సుశాంత్ సుఖదేవ్ తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణం పూర్తిగా కలుషితం అయిందని, పర్యావరణ పరిరక్షణ అనేది విద్యార్థి దశ నుండి అవగాహన కలిగి ఉండాలన్నారు. దీనికోసం అటవీ ప్రాంతాన్ని పెంచడం మినహా వేరే ప్రత్యామ్నాయం లేదన్నారు. జిల్లాలో అటవీ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో రేంజ్ అధికారి శశిధర్ బాబు, బీట్ అధికారి విజయ్ విద్యార్థులు పాల్గొన్నారు.



# మహొాన్నత వ్యక్తి మహాత్మా గాంధీ

## జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** అహింసా మార్గంలో దేశానికి స్వాతంత్రం సాధించిన మహొాన్నత వ్యక్తి మహాత్మా గాంధీ అని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. గురువారం మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, జిల్లా అధికారులతో కలిసి స్వాతంత్ర పోరాటంలో ప్రాణత్యాగాలతో అసువులు బాసిన మహనీయులను స్మరించుకుంటూ 2 నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ బ్రిటిష్ సంకెళ్ల నుండి అహింసా మార్గంలో అలుపెరగని పోరాటం చేసి సత్య దీక్షతో స్వాతంత్రానికి కృషి చేసిన మోహన్ దాస్ కరంచంద్ గాంధీ దేశానికి జాతిపితగా చిరస్మరణీయులని అన్నారు. మహాత్మ సత్యం, అహింస మార్గాలను ఆచరించి మనందరికీ ఆదర్శంగా నిలిచారని, మహాత్ముడు చూపిన సన్మార్గంలో ముందుకు వెళుతూ దేశాభివృద్ధికి సమిష్టిగా కృషి చేద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# పుష్కరఘాట్ ప్రారంభం

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ :** ఆసిఫాబాద్ బాలేశ్వరాలయ సమీప ఉత్తర వాహిని పెద్దవాగు వద్ద నర్మదా , సరస్వతి పుష్కర ఘాట్లను స్థానిక శాసన సభ్యురాలు కోవ లక్ష్మి ,భాజపా సినియర్ నాయకులు, మాజీ జెడ్పిటిసి సభ్యులు అరిగెల నాగేశ్వరరావు తో కలిసి గురువారం ప్రారంభించారు . అర్చకులు ఇందారం మధుకర్ శర్మ ,నరేష్ శర్మ ఆధ్వర్యంలో గంగా పూజను నిర్వహించి హారతులు ఇచ్చారు. కీ.శే. స్వాతంత్ర్య సమరయోధులు దండనాయకుల శ్రీనివాసరావు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో కుంభమేళా సందర్భంగా ఈ పుష్కర ఘాట్ ను ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం మహిళల దుస్తుల మార్పిడి గది, కూర్చునేందుకు బెంచీలను సైతం ఏర్పాటు చేశారు. నవజ్యోతి సాంస్కృతిక సంస్థ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ ఆసిఫాబాద్ పట్టణంలో ఉత్తర వాహిని జీవ నది ఉండడం చాలా అదృష్టమని అన్నారు. చారిత్రాత్మకమైన బాలేశ్వరాలయం ఉత్తర వాహిని నది ఒడ్డున ఉన్నందున ఈ పుష్కర ఘాట్లను, ఆలయాన్ని అభివృద్ధి పరిచేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్ ,భాజపా నాయకులు విశాల్, నవజ్యోతి సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపకులు దండనాయకుల రామారావు, సురేష్ కుమార్, అధ్యక్షులు ధర్మపురి వెంకటేశ్వర్లు, సంస్థ ప్రముఖులు గుర్రాల వేంకటేశ్వర్లు, రాధాకృష్ణ చారి, ప్రముఖులు గుండ వెంకన్న, జీవన్, శ్రీనివాస్, కీ.శే. శ్రీనివాసరావు కుటుంబీకులు, స్థానికులు పాల్గొన్నారు.

# అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు వేగంగా పూర్తి చేయాలి



## జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పనులను వేగవంతం చేసి ఫిబ్రవరి 10వ తేదీలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భావన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారితో కలిసి అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ పథకంలో జిల్లాలోని అన్ని యాజమాన్యాలు, జిల్లా పరిషత్, మండల పరిషత్, గిరిజన సంక్షేమ పాఠశాలలు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలలలో చేపట్టిన త్రాగునీరు, మూత్రశాలలు, బాలికల మూత్రశాలలు, విద్యుదీకరణ, గదులు, ఇతర మరమ్మత్తుల పురోగతిపై మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు పూర్తి సదుపాయాల నడుమ నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. జిల్లాలోని పాఠశాలలలో చేపట్టిన 4 కాంపోనెంట్ పనులు ఫిబ్రవరి 10వ తేదీలోగా పూర్తి చేయాలని, ఎంపిక చేసిన ప్రతి పాఠశాలలో త్రాగునీరు, మూత్రశాలల నిర్మాణం, విద్యుదీకరణ, గదుల మరమ్మత్తు పనులను 100 శాతం పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని తెలిపారు. పనులలో నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, మిగిలిన పనులను వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో పూర్తి అయిన పనుల మేరకు మాత్రమే ఎం. బి. లో రికార్డులు పూర్తిచేసి బిల్లుల కొరకు సమర్పించాలని తెలిపారు. ప్రతి పనికి ఫోటో, క్వాలిటీ కంట్రోల్ రిపోర్ట్స్, మండల విద్యాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఇంజనీరింగ్ అధికారి సంతకం చేసిన ధ్రువపత్రాన్ని జతపరిచి జిల్లా విద్యాధికారి కార్యాలయంలో అందించాలని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పనులు చేపట్టాలని సూచించారు. అనంతరం మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో ప్రతి మండల కేంద్రంలో మార్కెట్ ప్రాంతాలు, బస్సు స్టాపులు, జన సమూహం అధికంగా ఉండే ప్రాంతాలలో అనువైన స్థలాలను ఎంపిక చేసి కమ్యూనిటీ శానిటేషన్ కాంప్లెక్స్ ల నిర్మాణాలను వెంటనే చేపట్టాలని తెలిపారు. వివిధ పనుల నిమిత్తం మార్కెట్ కు వచ్చే ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా మూత్రశాలలు ఉపయోగపడతాయని, పనులు దళిత గతిన పూర్తి చేయాలని తెలిపారు. వచ్చే వేసవికాలంలో త్రాగునీటికి ఇబ్బంది లేకుండా ప్రజలందరికీ సరఫరా చేసేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. త్రాగునీటికి ఇబ్బంది ఉన్న గ్రామాలు, నివాస ప్రాంతాలను గుర్తించి నివేదిక అందించాలని, నూతన బోరు బావులు మంజూరుకు చర్యలు తీసుకోవాలని, త్రాగునీటి ఎద్దడి ఉన్న గ్రామాలలో ప్రతి ఇంటిని సందర్శించి నీటి వనరులను గుర్తించి పూర్తి వివరాలతో జాబితా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ పథకం క్రింద వేసవికాలంలో ప్రతి గ్రామానికి త్రాగునీరు అందే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి గౌడ్, పంచాయితీ ఇంజనీరింగ్ ఈ. ఈ. ప్రభాకర్, విద్యా శాఖ అధికారులు, మిషన్ భగీరథ అధికారులు, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, మండల పరిషత్ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ కెరటం
www.udyamakeratam.com
నిజం.. రక్షతి రక్షితః
తెలుగు దినపత్రిక
UDYAMA KERATAM TELUGU DAILY







# జర్నలిజం వృత్తిని అపవిత్రం చేస్తే ఊరుకునేది లేదు

## టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ

**ఉద్యమ కెరటం, గజ్వేల్:** సమాజ జ్ఞానం, జర్నలిజం విలువల పట్ల అవగాహనా లేకుండా, జర్నలిస్టుల పేరుతో సంచరిస్తూ, దోపిడికి పాల్పడుతూ పవిత్రమైన జర్నలిజం వృత్తికి మచ్చ తెస్తున్న నకిలీ ముఠాలకు తగినరీతిలో బుద్ధి చెప్పక తప్పదని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షులు కే.విరాహత్ అలీ హెచ్చరించారు. గురువారం నాడు స్థానిక ప్రెస్ క్లబ్ లో జరిగిన గజ్వేల్ నియోజకవర్గ జర్నలిస్టుల సమావేశం, యూనియన్ డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఇటీవల కాలంలో జర్నలిస్టుల పేరుతో కొన్ని అసాంఘిక శక్తుల ఆగడాలు మితిమీరి పోతున్నాయని, ప్రజలను, అధికారులను బ్లాక్ మెయిల్ చేస్తూ వసూళ్లకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి ముఠాల కదలికలపై తమ సంఘం కన్నేసి పెట్టిందని, చట్టపరంగా వారికి శిక్ష పడేలా చర్యలు చేపడుతున్నట్లు విరాహత్ అలీ స్పష్టం చేశారు. సుదీర్ఘ సామాజిక చరిత్ర కలిగి ఉన్న గజ్వేల్ ప్రెస్ క్లబ్ ను స్థాపించి 25యేండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా రజతోత్సవాలు జరిపేందుకు నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో జర్నలిస్టుల సంక్షేమానికి టీయూడబ్ల్యూజే అవిశ్రాంతంగా కృషి చేస్తుందన్నారు. ప్రధాన సమస్యలైన ఇంటి స్థలాలు, ఇండ్లు, ఆరోగ్య పథకం, అక్రెడిటేషన్ కార్డుల మంజూరీ తదితర సంక్షేమ చర్యల అమలు కోసం ప్రభుత్వంతో చర్చిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అంతకముందు యూనియన్ నాయకులు సురేందర్, మధుసూదన్ రెడ్డి, సత్యనారాయణ, కృష్ణ, జగదీశ్, కిరణ్, మునీర్, యాదగిరి తదితరులు మాట్లాడారు.

## వేములవాడలో లారీ బీభత్సం

**వేములవాడ,జనవరి 30 :** వేములవాడలో లారీ బీభత్సం సృష్టించింది. గురువారం ఉదయం పట్టణంలోని మొదటి బైపాస్ రోడ్డులోని మహాలక్ష్మి వీధిలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. అక్కడితో ఆగని లారీ.. మూలవాగు వంతెనపై డివైడర్లను ఢీకొట్టి.. తిప్పాపూర్‌లోని కదిరే రాజమల్లయ్య దుకాణంలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో రాజ మల్లయ్య బైక్ కన్సల్టెన్సీలోని ఐదు వాహనాలు ధ్వంసమయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, డ్రైవర్ మద్యం మత్తులో ఉండటంతోనే ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. రోడ్డు ప్రమాదంలో ఓ కానిస్టేబుల్ మృతి చెందాడు. ఈ విషాదకర సంఘటన నిజామాబాద్ జిల్లాలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలంలోని గర్జనపల్లి చెందిన అజ్మీరా కల్యాణ్ నాయక్(29) నిజామాబాద్ జిల్లా డిచ్ పల్లి 7 వ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కాగా, బుధవారం రాత్రి విధులు ముగించుకుని ఇంటికి తిరిగి వెళుతున్న క్రమంలో కల్యాణ్ నాయక్‌ను లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో మృతుడి స్వగ్రామం గర్జనపల్లిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గురువారం అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య సుష్మ, కుమార్తె అభియుక్త, కుమారుడు అభిషేక్ ఉన్నారు.



## కరీంనగర్ డీఈఈకి ఉద్యోగుల సన్మానం

**ఉద్యమ కెరటం, కరీంనగర్:** కరీంనగర్‌లోని డివిజనల్ఎలక్ట్రికల్ ఇంజినీర్(ఆపరేషన్స్) కార్యాలయానికి డిస్కం లెవల్‌లో 'బెస్ట్‌పెర్ఫార్మర్' అవార్డు రావడంపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం నగరంలోని కార్యాలయంలో డీఈఈ జే రాజంకు ఘనంగా సన్మానించారు. డివిజన్‌కు అవార్డు వచ్చేలా కృషి చేసిన డీఈఈకి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డీఈఈ జే రాజం మాట్లాడుతూ కరీంనగర్‌పట్టణం డివిజనల్ కార్యాలయం డిస్కం లెవల్‌లో నెం.1గా ఉందని చెప్పారు. మన పనితనంతో అవార్డు అందుకున్నామని చెప్పారు. దీనికి సహకరించిన ఉద్యోగులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. అవార్డుతో తమపై మరింత బాధ్యత పెరిందని సూచించారు. ఇదే ఉత్సాహంతో మరింత కష్టపడి మరిన్ని అవార్డులు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. సహకరించిన వారికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఏఈ సీహెచ్ సంపత్‌కుమార్, ఏఈ కే గోపీనాథ్, సబ్ ఇంజినీర్లువీ వంశీ, బీ నాగరాజు, కే రమేశ్, జేఏవోలు జమీరుద్దీన్‌సిద్దిఖీ, కే శ్రీనివాస్, ఎం రమేశ్, ఎస్ఏ దేవరాజ్, నిసార్, సీనియర్అసిస్టెంట్ కే అనిత, జూనియర్అసిస్టెంట్ ఎం అజయ్‌కుమార్, కార్యాలయ సిబ్బంది శ్రీధర్‌రావు, ఖాజా మోయినుద్దీన్, ఎం రాజిరెడ్డి, పీ రోహిత్‌రెడ్డి, డీ సమత, ఎల్ఎస్ శ్రీనివాస్, జేఏ వసంత్, మౌనిక, ఆర్టిజన్‌హాలీం, ఓఎస్‌బీ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

## తిర్యాణి వసతి గృహంలో పల్లెనిద్ర చేపట్టిన జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి

**ఉద్యమ కెరటం, తిర్యాణి :** విద్యార్థులు ఏకాగ్రతతో చదవడంతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. బుధవారం రాత్రి తిర్యాణి మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర వసతి గృహంలో విద్యార్థులతో కలిసి భోజనం చేసి అక్కడనే బస చేశారు. గురువారం ఉదయం 4.30 గంటలకు వసతి మైదానంలో విద్యార్థులతో కలిసి యోగ, వ్యాయామం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. శారీరక కార్యకలాపాలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని, విద్యార్థులు శారీరకంగా దృఢంగా ఉండడంతో పాటు మానసిక ప్రశాంతతను పెంపొందించుకోవాలని తెలిపారు. ప్రతిరోజు యోగ, వ్యాయామం తప్పనిసరిగా చేయాలని, శారీరక శ్రమకు సమయం కేటాయించాలని తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాల సాధన దిశగా పట్టుదలతో కృషి చేయాలని తెలిపారు. అనంతరం విద్యార్థులకు పంపిణీ చేస్తున్న బూస్ట్ ప్యాకెట్ల గడువు తేదీని పరిశీలించి, విద్యార్థుల ఆరోగ్యం పై శ్రద్ధ తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# గుర్తింపునిచ్చేది ఆ చిత్రాలే!

కంటెంట్ ఉన్న చిత్రాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తానని అంటోంది అందాల తార రాశీ ఖన్నా. ఇటీవలే 'ది సబర్మతీ రిపోర్ట్', 'అరణ్మనై 4' లాంటి సినిమాలతో ప్రేక్షకులను పలకరించిన కథానాయికీమె. ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో తీరిక లేకుండా గడుపుతోన్న ఈమె.. తన ఎదుగుదలకు సహాయపడే చిత్రాలపైనే దృష్టి సారిస్తున్నట్లు తెలిపింది.

తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రాశి మాట్లాడుతూ.. "నేను చిత్రసీమలో అడుగు పెట్టి దాదాపు దశాబ్దం గడిచింది. ఈ ప్రయాణంలో తెలుగు, తమిళ, హిందీ భాషలలో ఎన్నో విజయవంతమైన సినిమాల్లో భాగమయ్యాను. ఒకే రకమైన ప్రాజెక్టులు చేస్తే అవి నన్ను ఉత్తేజపరచలేవు. నేను ఎక్కువగా కమర్షియల్ చిత్రాలను ఇష్టపడతా. కానీ ఈ సినిమాలు చేయడానికి ఇంకా చాలా సమయం ఉంది. ఒక అద్భుతమైన నటిగా ఎదగాలని ఎప్పటి నుంచో కోరుకుంటున్నా. కంటెంట్ ఆధారిత చిత్రాలు మాత్రమే కెరీర్‌లో ఎదగడానికి ఉపయోగపడతాయి. అవే నటిగా పరిశ్రమలో మంచి గుర్తింపునిస్తాయ"ని చెప్పుకొచ్చింది.

# 'తండేల్'.. ఆ సీక్వెన్స్‌కు రూ.18 కోట్లు

## చందూ మొండేటి



నాగచైతన్య హీరోగా దర్శకుడు చందూ మొండేటి తెరకెక్కించిన పాన్ ఇండియా చిత్రం 'తండేల్'. సాయి పల్లవి హీరోయిన్. శ్రీకాకుళం జిల్లా డి.మత్స్యలేశం గ్రామంలో చోటు చేసు కున్న సంఘటనల ఆధారంగా రూపొందిన చిత్రమిది. వేటకు వెళ్లిన పలువురు మత్స్యకా రులు పాకిస్థాన్ కోస్ట్ గార్డుకు చిక్కి రెండేళ్లు జైలు శిక్ష అనుభవించిన వృత్తాంతాన్ని తెరపైకి తీసుకొస్తున్నారు. సినిమా ఫిబ్రవరి 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా దర్శకుడు ప్రమోషన్స్‌లో పాల్గొంటూ బిజీగా ఉన్నారు. పలు ఇంటర్వ్యూల్లో ఆయన పంచుకున్న ఆసక్తికర సంగతులివీ.. "నా గత చిత్రం 'కార్తికేయ 2' అనుభవం 'తండేల్'కు బాగా ఉపయోగపడింది. నేనెప్పుడూ అనుకున్న బడ్జెట్‌ను దాటి సినిమా చేయను. ఈ మూవీ విషయానికొస్తే.. రీసెర్చ్ అనంతరం కథ రాయడం పూర్తయింది. తర్వాత హీరో బాడీ లాంగ్వేజ్ ఎలా ఉంటే బాగుంటుందో టెస్ట్ చేసేందుకు మళ్లీ డి.మత్స్యలేశం వెళ్లాం. ఇంకా ఏం జరిగింది? అని అక్కడి వారిని అడగ్గా సముద్రంలో చోటు చేసుకున్న తుపాను, ఆ సమయంలో మత్స్యకా రుల సమయస్ఫూర్తి గురించి వివరించారు. అప్పటికే పూర్తయిన కథకు తగ్గట్టు బడ్జెట్ ఫిక్స్ అయిపోయినా.. ఇలాంటి విజువల్స్ ఉంటే బాగుంటుందని భావించా. అదే విషయం చెబితే నిర్మాతలు అంగీకరించారు. ఆ ఒక్క ఎపిసోడ్‌కే రూ.18 కోట్లు బడ్జెట్ అయింది. లైవ్ లొకేషన్ (సముద్రం)లో, స్టూడియోలో, మినియేచర్, వర్చ్యువల్‌గా సన్నివేశాలు చిత్రీకరించాం. ఎమోషన్ ఉంటుంది"

"తండేల్' రిలీజ్ తర్వాత సూర్యతో సినిమా చేయబోతున్నా. ఇప్పటికే ఆయన్ను కలిసి రెండు కథలు చెప్పా. రెండింటిలో ఏదో ఒకటి ఖరారైతే దాన్ని డెవలప్ చేయాలి. మరోవైపు, ఓ కథను.. నిర్మాత అల్లు అరవింద్ హిందీ హీరోతో చేయాలనే ఆలోచనలో ఉన్నారు. వీటితోపాటు 'కార్తికేయ 3' కూడా తెరకెక్కిస్తా" అని తెలిపారు. గతంలో నాగార్జునతో పోలీస్ స్టోరీతో ఓ సినిమా చేయాలనుకున్నానని, ఎన్టీఆర్‌కు ఓ కథ వినిపించానని, అనివార్య కారణాల వల్ల అవి కార్యరూపం దాల్చలేదన్నారు.

# వచ్చే నెల నుంచి ఎన్టీఆర్ యాక్షన్ షురూ..?



ఎన్టీఆర్ కథానాయకుడిగా 'కేజీఎఫ్' ఫేమ్ ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో పాన్ ఇండియా చిత్రం తెరకెక్కబోతున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన ప్రీప్రొడక్షన్స్ పనులు కూడా చివరి దశకు చేరుకున్నాయి. తాజా సమాచారం ప్రకారం ఫిబ్రవరిలో ఈ సినిమా సెట్స్‌మీదకు వెళుందని తెలిసింది. ఎన్టీఆర్‌ను అత్యంత శక్తివంతంగా ఆవిష్కరిస్తూ ఇంటెన్స్ యాక్షన్ డ్రామాగా దర్శకుడు ప్రశాంత్‌నీల్ ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారని చెబుతున్నారు. ఈ సినిమాకు 'డ్రాగన్' అనే పేరు పరిశీలనలో ఉన్నట్లు సోషల్‌మీడియాలో ప్రచారం జరుగుతున్నది. త్వరలో టైటిల్‌ను అధికారికంగా ప్రకటించే అవకాశముంది. ఇదిలా వుండగా ఎన్టీఆర్-హృతిక్‌రోషన్ నటిస్తున్న మల్టీస్టారర్ 'వార్-2' షూటింగ్ పూర్తిచేసుకుంది. ఈ ఏడాదే ప్రేక్షకుల ముందుకురానుంది.

# బాయ్స్ తరువాత మళ్లీ యాక్టర్‌గా థమన్



కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వం వహించిన బాయ్స్ సినిమాతో యాక్టర్‌గా తొలిసారి సిల్వర్ స్క్రీన్‌పై మెరిశాడు మ్యూజిక్ డైరెక్టర్ ఎస్ థమన్. సిద్దార్థ్, జెనీలియా కాంబోలో వచ్చిన ఈ చిత్రంలో మ్యూజిక్ బ్యాండ్ టీంలో ఒకడిగా నటించాడు థమన్. అయితే ఆ తర్వాత కంపోజర్‌గా మాత్రమే సక్సెస్‌ఫుల్‌గా ప్రయాణాన్ని సాగిస్తున్నాడు. ప్రస్తుతం ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో ఉన్న టాప్ కంపోజర్లలో ఒకడిగా నిలిచానడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ స్టార్ కంపోజర్ మళ్లీ నటుడిగా మారబోతున్నాడన్న వార్త ఇప్పుడు ఇండస్ట్రీ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. తాజా టాక్ ప్రకారం అథర్వ వన్ ఆఫ్ ది కీ రోల్‌లో నటిస్తోన్న ఓ తమిళ చిత్రంలో ఎస్ థమన్ లీడ్ యాక్టర్‌గా కనిపించబోతున్నాడట. దీనికి సంబంధించి త్వరలోనే అధికారిక ప్రకటన కూడా ఉండబోతుందని కోలీవుడ్ సర్కిల్‌లో కథనాలు హల్ చల్ చేస్తున్నాయి. మరి ఇదే నిజమైతే థమన్ ఎలాంటి పాత్రలో కనిపిస్తాడనేది అంతటా ఆసక్తికరంగా మారింది. ఇటీవలే గేమ్ ఛేంజర్, డాకు మహారాజ్ సినిమాలకు మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందించాడు థమన్. ఈ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో టాక్ తెచ్చుకోలేకపోయినా మ్యూజిక్ పరంగా మంచి మార్కులు పడ్డాయి. ప్రస్తుతం ప్రభాస్‌తో రాజాసాబ్, పవన్ కల్యాణ్‌తో ఓజీ సినిమాలు చేస్తున్నాడు థమన్. అఖండ 2 కూడా లైన్‌లో ఉంది.



# ఆ వార్తలు పూర్తిగా అవాస్తవం : రాంగోపాల్ వర్మ

రీసెంట్‌గా సత్య సినిమా చూసినప్పుడు కన్నీళ్లొచ్చాయని, తాను ప్రేక్షకుల నమ్మకాన్ని కోల్పోయానని.. ఇక నుంచి తన స్థాయి ప్రమాణాలతో సినిమాలు చేస్తానని ప్రముఖ డైరెక్టర్ రాంగోపాల్ వర్మ ప్రతిజ్ఞ చేశాడని తెలిసిందే. ఈ నేపథ్యంలో 'సిండికేట్' పేరుతో రామ్‌గోపాల్‌వర్మ కొత్త చిత్రాన్ని కూడా ప్రకటిం చేసి అందరినీ షాక్‌కు గురి చేశాడు. అయితే అమితాబ్ బచ్చన్, వెంకటేశ్, ఫహద్ ఫాసిల్ ఈ సినిమాలో ప్రధాన పాత్రల్లో నటించబోతున్నారంటూ సోషల్ మీడియాలో వార్తలు హల్ చల్ చేస్తున్నాయి. ఈ విషయంలో వివాదాస్పద ఫిల్మ్ క్రిటిక్ కమల్ ఆర్ ఖాన్ స్టేట్‌మెంట్‌పై స్పష్టత ఇచ్చాడు వర్మ. అవును.. నిజమే నేను సిండికేట్‌పై వర్క్ చేస్తున్నా. కానీ ప్రొడక్షన్ హౌస్, నటీనటులకు సంబంధించి వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవం..అని ట్వీట్ చేశాడు. 'అత్యంత భయంకరమైన జంతువు ఒక్క మనిషి మాత్రమే' అనే పాయింట్ నేపథ్యంలో ఈ సినిమాను తెరకెక్కించబోతున్నట్లు ప్రకటించి హాట్ టాపిక్‌గా నిలిచాడు. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ తెరకెక్కించనున్నట్టు వార్తలు వస్తుండగా.. త్వరలోనే వర్మ కాంపౌండ్ నుంచి స్పష్టత వచ్చే అవకాశాలున్నట్టు ఫిలింనగర్ సర్కిల్ సమాచారం.

# బాలీవుడ్‌కు దక్షిణాది నటీనటులు అవసరం : రెజీనా కీలక వ్యాఖ్యలు




హిందీ చిత్ర పరిశ్రమను ఉద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు నటి రెజీనా. ప్రస్తుతం ఆ ఇండస్ట్రీకి దక్షిణాది నటీనటుల అవసరం ఉందని ఆమె అన్నారు. ఆ పరిశ్రమలో దక్షిణాది తారలకు ఉండే అవకాశాల గురించి తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో రెజీనా మాట్లాడారు. 'బాలీవుడ్ వాళ్లకు ఇప్పుడు వేరే ఆప్షన్ లేదు. గతంలో గడ్డు పరిస్థితులు ఉండేవి. దక్షిణాది చిత్ర పరిశ్రమకు చెందిన తారలకు అక్కడ అవకాశాలు దొరకడం ఎంతో కష్టంగా ఉండేది. అప్పట్లో మీరు సౌత్ నుంచి వచ్చారని తెలిస్తే ఛాన్సులు ఇచ్చేవాళ్లు కాదు. దానికి భాషాపరమైన ఇబ్బందులు కూడా ఓ కారణమై ఉండొచ్చు. కానీ, కరోనా తర్వాత ఇండస్ట్రీలో పరిస్థితులు మారాయి. సౌత్‌కు చెందిన సినీతారలకు ఇప్పుడు వాళ్లు కూడా అవకాశాలు ఇస్తున్నారు. తమ చిత్రాలను ఎక్కువమంది ప్రేక్షకుల్లోకి తీసుకువెళ్లడం కోసం వారు దక్షిణాది తారలను ఎంచుకోవడం అవసరంగా మారింది" అని చెప్పారు. బాలీవుడ్‌లో ప్రాజెక్టులు చేయడంపై మాట్లాడుతూ ఇలాంటి ఇబ్బందులు ఏవీ తాను ఎదుర్కోలేదని తెలిపారు. తానొక బాలీవుడ్ ప్రాజెక్ట్‌కు సంతకం చేశానని త్వరలోనే దాని విశేషాలు పంచుకుంటానని అన్నారు. రెజీనా నటించిన తాజా చిత్రం 'విదాముయార్చి'. అజిత్ హీరోగా దర్శకుడు మాగిజ్ తిరుమేని దీనిని రూపొందించారు. త్రిష కథానాయిక. అర్జున్ కీలక పాత్ర పోషించారు. ఇందులో రెజీనా అర్జున్‌కు జోడీగా కనిపించనున్నారు. ఫిబ్రవరి 6న ఈ సినిమా విడుదల కానుంది. ఈనేపథ్యంలోనే 'విదాముయార్చి' ప్రమోషన్స్‌లో ఆమె పాల్గొని సినిమా విశేషాలు పంచుకుంటున్నారు. ఇది తప్పకుండా ప్రేక్షకులకు నచ్చుతుందని అన్నారు. మాగిజ్ తిరుమేని అద్భుతంగా ఈ చిత్రాన్ని రూపొందించారని చెప్పారు.



# జీవితంలో వారిని ఎప్పటికీ వదులుకోను : సమంత

స్టార్ హీరోయిన్ సమంత ప్రస్తుతం తిరిగి సినిమాల్లో బిజీ అవ్వాలని చూస్తుంది. మాయోసైటిస్ కారణంగా ఏడాది పాటు సినిమాలకు దూరంగా ఉంటున్న సామ్ ఇప్పుడు వరుసగా సినిమాలు కమిట్ అవుతుంది. సమంతకు తెలుగు, తమిళ్‌లో చాలా మంది అభిమానులు ఉన్నారు. కాగా సమంత రీసెంట్‌గా చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. చిన్మయి భర్త రాహుల్ రవీం ద్రన్ తనకు బెస్ట్ ఫ్రెండ్ అని తెలిపింది. మయో సైటిస్ కోసం చికిత్స తీసుకుంటున్న సమయంలో ప్రతిరోజు అతను తన దగ్గరకు వచ్చిన ఎంతో ధై ర్యం చెప్పేవాడని, కొంత సమయం నాతో గడిపి జోక్స్ వేస్తూ తనను నవ్వించేవాడని, చిన్మయి కూడా తనకు బెస్ట్ ఫ్రెండ్ అని తెలిపింది. జీవితంలో వారి ని ఎప్పటికీ వదులుకోను అని సామ్ చెప్పుకొచ్చింది.



# ఆకట్టుకుంటున్న పరదా ఫస్ట్ లుక్

అనుపమ పరమేశ్వరన్ లీడ్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'పరదా'. మలయాళ నటి దర్శన, సంగీత కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సినిమా బండి ఫేం ప్రవీణ్ కాండ్రేగుల దర్శకత్వం వహిస్తున్నాడు. శ్రీధర్ మక్కువ, విజయ్ డొంకాడ నిర్మిస్తున్న ఈ మూవీ ఫస్ట్ లుక్‌తోపాటు టీజర్‌ను కూడా విడుదల చేయగా.. మంచి స్పందన వస్తోంది. కాగా ఈ సినిమా మలయాళ వెర్షన్‌కు సంబంధించిన వార్త ఒకటి బయటకు వచ్చింది. ఈ మూవీ మలయాళ థియాట్రికల్ హక్కులను పాపులర్ మాలీవుడ్ స్టార్ యాక్టర్ దుల్కర్ సల్మాన్ సొంతం చేసుకున్నాడు. హెూంబ్యానర్ వేఫరెర్ ఫిలిమ్స్‌లో పరదా చిత్రాన్ని విడుదల చేయను న్నారు. మిస్టికల్ థ్రిల్లర్‌గా రాబోతున్న ఈ చిత్రం సంప్రదాయపు కట్టుబాట్లు మహిళలను ఎలా అణచివేస్తున్నాయి. ఎలా ఎదగకుండా అణగదొక్కుతున్నాయి.. వాటిని దాటి మహిళలు ఎలా ఎదుగుతున్నారు అనే కాన్సెప్ట్ తో రాబోతున్నట్లు టీజర్ హింట్ ఇచ్చేస్తుంది.

ఉద్యమ కెరటం
నిజం.. రక్షతి రక్షితః
తెలుగు దినపత్రిక
UDYAMA KERATAM TELUGU DAILY
www.udyamakeratam.com



# అప్పుడూ విరాట్‌కు అదే బలహీనత

## ఊహించని రీతిలో ఎదిగాడు : కైఫ్



భారత స్టార్ బ్యాటర్, మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ రంజీ మ్యాచ్ ఆడుతు న్నాడు. రైల్వేస్‌తో జరుగుతోన్న పోరులో దిల్లీకి ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. చివరిసారిగా 2012లో విరాట్ దేశవాళీ మ్యాచ్ ఆడిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో ఉత్తర్ ప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన భారత మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ గత మ్యాచ్‌ను గుర్తు చేసుకున్నాడు. అప్పుడు వీరేంద్ర సెహ్వాగ్, గౌతమ్ గంభీర్, ఇషాంత్ శర్మ, ప్రవీణ్ కుమార్, భువనేశ్వర్ వంటి సీనియర్లు ఆడినట్లు పేర్కొన్నాడు. అయితే, విరాట్ కోహ్లీకి అప్పుడూ ఆఫ్‌సైడ్ బంతులను వెంటాడి ఔటయ్యే బలహీనత ఉండేదని.. ఆ తర్వాత క్రికెట్ కెరీర్‌లో భారీగా పరుగులు చేసిన తీరు అద్భుతమని కైఫ్ కొనియాడాడు. "2012లో దిల్లీతో మ్యాచ్‌లో మేం తలపడ్డాం. అంతర్జాతీయ క్రికెట్‌లో బిజీ కాకముందు విరాట్ కోహ్లీ చివరిగా ఆ మ్యాచ్ ఆడాడు. అప్పటికి అతడేమీ స్టార్ కాదు. అప్పుడు కూడా అతడికి ఆఫ్‌సైడ్ బంతి వీక్‌నెస్ ఉంది. ఇప్పుడూ ఇదే బలహీనతతో ఉండటం నమ్మశక్యం కావడం లేదు. బోర్డర్ - గావస్కర్ ట్రోఫీలో ఆసీస్ బౌలర్లు పక్కాగా ప్లాన్ చేసి కోహ్లీని ఔట్ చేశారు. మాతో రంజీ మ్యాచ్‌లో ఆడినప్పుడు కూడా ఇలానే పెవిలియన్‌కు చేరాడు. భువనేశ్వర్ బౌలింగ్‌లో వికెట్ ఇచ్చేసేవాడు. కానీ, అతడు తన వీక్‌నెస్‌ను జయించి అంతర్జాతీయ క్రికెట్‌లో భారీగా పరుగులు చేయడం అద్భుతమనే చెప్పాలి. వన్డేల్లో 50 శతకాలు చేశాడు. టెస్టుల్లో ఇటీవల మినహా.. అంతకుముందు టాప్ బ్యాటర్‌గా నిలిచాడు" అని కైఫ్ తెలిపాడు. "ఇప్పుడు విరాట్ కోహ్లీ రంజీ మ్యాచులో ఆడటం అతడికే కాకుండా.. జట్టుకూ మంచిది. ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు ఫామ్‌ను అందుకొంటే టీమ్‌ఇండియాకు తిరుగుండదు. గత వన్డే ప్రపంచకప్‌లో కోహ్లీ ఆటను మరిచిపోకూడదు. టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఇప్పుడు రంజీల్లో కొంత ప్రాక్టీస్ చేసినట్లవుతుంది. ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌కు ముందు కొన్ని పరుగులు చేస్తే ఆత్మవిశ్వాసం పెరగడం ఖాయం. అప్పుడు ఛాంపియన్స్ ట్రోఫీలో అతడి బ్యాట్ నుంచి మెరుగైన ప్రదర్శనను చూసే అవకాశం ఉంటుంది" అని మాజీ క్రికెటర్ వెల్లడించాడు.



# ధోనీ, విరాట్ అంటే గంభీర్‌కు ఇష్టం ఉండదా?

## చిన్ననాటి కోచ్ ఏమన్నాడంటే?

వారిద్దరూ దాదాపు ఒకే తరం క్రికెటర్లు. ఒకరేమో భారత జట్టుకు వన్డే, టీ20 ప్రపంచకప్‌లను అందించిన సారథి. మరొకరు ఆ జట్టులో కీలక పాత్ర పోషించిన స్టార్ బ్యాటర్. కానీ, వారి మధ్య సరైన సంబంధాలు లేవనేది క్రికెట్ వర్గాల్లో నడిచే చర్చ. ఇప్పటికే అర్థమై ఉంటుంది కదా.. వారిద్దరే ఎంఎస్ ధోనీ, గౌతమ్ గంభీర్. ధోనీ ఇంకా ఐపీఎల్‌లో కొనసాగుతూ ఉండగా.. గంభీర్ భారత జట్టు ప్రధాన కోచ్‌గా ఉన్నాడు. ధోనీ అంటే గంభీర్ కు పడదనే వ్యాఖ్యలు సరైనవి కాదంటూ సంజయ్ భరద్వాజ్ స్పష్టం చేశారు. ఈయన గంభీర్‌కు చిన్ననాటి కోచ్. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. గంభీర్ తీరుపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. అందరూ అతడిని తలబిరుసు కలిగిన వ్యక్తిగా భావిస్తారని.. కానీ, దేశం కోసం ఆడేటప్పుడు నిబద్ధతతో ఉంటాడని భరద్వాజ్ వ్యాఖ్యానించాడు. "గంభీర్ ఎప్పుడూ ఎవరిపైనా అయిష్టత వ్యక్తం చేయడు. ఇదే నిజం. చాలా మంది బయట నుంచి ధోనీ అంటే గంభీర్‌కు ఇష్టం లేదనే వ్యాఖ్యలు చేస్తుంటారు. విరాట్ కోహ్లీ విషయంలోనూ అలాగే ఉంటాడని చెబుతుంటారు. కానీ, గంభీర్‌కు ఎవరిమీదా వ్యక్తిగత కోపం ఉండదు. అలాంటి వాటిని మనస్సులో కూడా పెట్టుకోడు. 2004లో ఇండియా సిరీస్ సమయంలో ధోనీ - గంభీర్ మధ్య వివాదం రేగినట్లు చెబుతారు. కానీ, వారిద్దరూ అప్పుడు రూమ్మేట్లు. ఇక విరాట్ కోహ్లీతో ఐపీఎల్ సమయంలో వాగ్వాదం జరిగింది. ఆ విషయం గురించి మేమిద్దరం మాట్లాడుకున్నాం. 'అక్కడ కరెక్ట్ ఏంటో మీకు తెలుసు?' అని గంభీర్ అన్నాడు. తన జట్టు సభ్యుల కోసం గంభీర్ ఎంతవరకైనా వెళ్తాడు. కోహ్లీ కూడా టీమ్ కోసమే అలా వ్యవహరించాడు. నవీనుల్ హక్‌ను ఏదో అనడంతోనే గంభీర్ ముందుకు రావాల్సి వచ్చింది. అక్కడ కోహ్లీ లేదా ఇంకెవరైనా ఉన్నా సరే గంభీర్ ప్రవర్తన అలానే ఉంటుంది. తన జట్టు ప్లేయర్ కాబట్టే గంభీర్ ముందడుగు వేశాడు. జట్టునే తన కుటుంబంగా భావించే అద్భుతమైన వ్యక్తి గంభీర్. ఏది జరిగినా అది మైదానం వరకే పరిమితం చేస్తాడు" అని వెల్లడించాడు.



# సిరాజ్‌తో మహిరా శర్మ డేటింగ్ వార్తలు?

## స్పందించిన నటి తల్లి

భారత క్రికెటర్, హైదరాబాదీ ప్లేయర్ మహ్మద్ సిరాజ్ ప్రేమ వార్తలు ఇటీవల సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతున్నాయి. ఇంతకుముందు లెజెండరీ గాయని ఆశా భోస్లే మనవరాలు జనై భోస్లేతో ప్రేమలో ఉన్నాడని రూమర్లు వచ్చాయి. వాటిని సిరాజ్ ఖండించాడు. ఆమె తనకు సోదరిలాంటివారని స్పష్టం చేశాడు. ఇప్పుడు హిందీ బిగ్‌బాస్ ఫేమ్ మహిరా శర్మతో సిరాజ్ డేటింగ్‌లో ఉన్నాడంటూ కథనాలు వస్తున్నాయి. చాలా దగ్గరి సన్నిహితులు ఈ విషయాన్ని వెల్లడించారని పలు ఆంగ్ల సైట్లలో వచ్చింది. దానికి కారణం.. మహిరా చేసిన పోస్టుకు ఇన్‌స్టాగ్రామ్‌లో సిరాజ్ లైక్ కొట్టడంతో పాటు ఫాలో కావడమేనని అందులో పేర్కొన్నాయి. ఈ ఊహాగానాలపై తాజాగా మహిరా శర్మ తల్లి సానియా శర్మ స్పందించారు. వాటిని ఎవరూ నమ్మొద్దని కోరారు. ఓ ఇంటర్వ్యూ సందర్భంగా జర్నలిస్టులు ఆమె వద్ద ఈ ప్రశ్న అడగ్గా.. "అసలు మీరేం మాట్లాడుతున్నారు? బయట వాళ్లు ఎన్నో అంటుంటారు. ఇప్పుడు నా కుమార్తె ఒక సెలబ్రిటీ. దీంతో ఫ్యాన్స్ ఆమెకు ఎవరితోనైనా సంబంధాలు కలిపేస్తారు. వాటన్నింటినీ మనం విశ్వసించాలా? అలాంటి వార్తలన్నీ తప్పే" అని స్పష్టం చేశారు.

### ఛాంపియన్స్ ట్రోఫీ

# ప్రారంభ వేడుకల షెడ్యూల్ ఇదే..!

ఐసీసీ మెగా టోర్నీ ఛాంపియన్స్ ట్రోఫీకి పాకిస్థాన్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఫిబ్రవరి 19 నుంచి ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. అయితే, స్టేడియాల ఆధునికీకరణ పనులు ఇంకా పూర్తి కాలేదని తెలుస్తోంది. ఈ క్రమంలో ట్రోఫీ ప్రారంభ వేడుకలకు సంబంధించి షెడ్యూల్‌ను పీసీబీ అప్రూవ్ చేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఫిబ్రవరి 16న లాహోర్ వేదికగా ప్రారంభ వేడుకలు జరగనున్నాయి. అంతర్జాతీయంగా ఉన్న క్రికెట్ బోర్డుల ప్రతినిధులు, సెలబ్రిటీలు, క్రికెట్ దిగ్గజాలు, ప్రభుత్వ అధికారులను ఆహ్వానించనుంది. ప్రారంభ వేడుకల్లో భారత కెప్టెన్ రోహిత్ శర్మ పాల్గొనడంపై ఇంకా క్లారిటీ రాలేదు. ఐసీసీ, పీసీబీ అధికారిక వర్గాలు కూడా ఇంకా ఏమీ ధ్రువీకరించలేదు. ఫిబ్రవరి 16న ఎనిమిది జట్ల కెప్టెన్ల ప్రెస్ కాన్ఫరెన్స్‌లు, ఫొటో షూట్‌లు ఉండనున్నాయి. తొలి మ్యాచ్ పాకిస్థాన్ - న్యూజిలాండ్ జట్ల మధ్య కరాచీ వేదికగా జరగనుంది. భారత్ మ్యాచులన్నీ దుబాయ్ వేదికగా జరగనున్నాయి. ఒకవేళ టీమ్‌ఇండియా ఫైనల్‌కు అర్హత సాధిస్తే ఆ మ్యాచ్ కూడా దుబాయ్‌లోనే నిర్వహించేందుకు ఇప్పటికే ఐసీసీ నిర్ణయం తీసుకుంది. ఐసీసీ విధించిన డెడ్‌లైన్‌లోగా స్టేడియాల ఆధునికీకరణ పనులను పూర్తి చేసేందుకు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ప్రయత్నిస్తోంది. ఫిబ్రవరి 7న ప్రధాని షెహబాజ్ షరీఫ్ చేతుల మీదుగా గడాఫీ మైదానం ప్రారంభం కానుంది. ఫిబ్రవరి 11న కరాచీలోని నేషనల్




స్టేడియం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా పాక్ అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారి హాజరుకానున్నారు.

### ఇంకా స్క్వాడ్‌ను ప్రకటించని పాక్

ఛాంపియన్స్ ట్రోఫీ కోసం ఎనిమిది జట్లు తలపడనున్నాయి. ఇప్పటికే ఏడు దేశాలు తమ స్క్వాడ్‌లను ప్రకటించాయి. ఆతిథ్య పాకిస్థాన్ మినహా.. భారత్, బంగ్లాదేశ్, న్యూజిలాండ్, అఫ్గానిస్థాన్, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా తమ జట్లను వెల్లడించాయి. ఐసీసీ ఇచ్చిన గడువు కూడా ఇప్పటికే దాటిపోయింది. అయినా, పాక్ తమ స్క్వాడ్‌ను ప్రకటించకపోవడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. మరోవైపు అఫ్గానిస్థాన్ ప్రత్యేకంగా జెర్సీని కూడా రూపొందించింది.

# ఛాంపియన్స్ ట్రోఫీకి ముందే పుంజుకొనేనా..!

టీమ్ ఇండియాకు పొట్టి ప్రపంచకప్ గెలిచిన ఆనందం ఏడాది కూడా నిలవలేదు. ఆ టోర్నీ ముగిసిన నాటి నుంచి వరుస ఓటములను చవిచూస్తూ వస్తోంది. డబ్ల్యూటీసీ ఫైనల్స్‌కు అలవోకగా వెళ్లడం ఖాయమనుకొన్న వేళ.. న్యూజిలాండ్, ఆస్ట్రేలియా సిరీసుల ఫలితాలతో జట్టు చతికిలపడింది. దీనికి తోడు డ్రెస్సింగ్ రూమ్ విషయాలూ అభిమానులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఈ దశలోనే బజ్‌బాల్‌తో క్రికెట్‌ను సమూలంగా మార్చేస్తామంటూ దూసుకెళ్తున్న ఇంగ్లండ్ జట్టు భారత పర్యటనకు వస్తోంది. మరో వారంలో మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయి. ఈ సీజన్‌లో ఐదు టీ20లు, మూడు వన్డేలు ఆడనుంది. ఎటొచ్చి.. వన్డేలే భారత్‌ను ఆందోళనకు గురి చేస్తున్నాయి. 2023 ప్రపంచకప్ తర్వాత భారత్ సరిగ్గా వన్డేలు ఆడలేదు. గతేడాది శ్రీలంకతో మూడు మ్యాచ్‌లు మాత్రమే ఆడింది. 27 ఏళ్ల తర్వాత లంకకు సిరీస్ కోల్పోయి ఓ చెత్త రికార్డును మూటగట్టుకొంది. మూడు మ్యాచ్‌ల్లో 27 వికెట్లను లంక స్పిన్నర్లు కూల్చారు. ఇప్పుడు ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌లో భారత్‌లోని పిచ్‌లపై జరగనుంది. ఆదిల్ రషీద్ వంటి నాణ్యమైన స్పిన్నర్ ఆ జట్టులో ఉన్నాడు. అతడికి అండగా లివింగ్ స్టోన్ వంటి వారు భుజం కాసే అవకాశం ఉంది. ఛాంపియన్స్ ట్రోఫీలో భారత మ్యాచ్‌లకు వేదికైన యూఏఈ పిచ్‌లు స్పిన్నర్లకు సహకరించే అవకాశాలుండటంతో ఈ సిరీస్ భారత్‌కు వార్మప్‌గా ఉపయోగపడుతుందనడంలో సందేహం లేదు.

### వారి ముగ్గురికి గడ్డుకాలమే..

విమర్శల జడివానలో తడిసి ముద్దయిన స్టార్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మకు ఈ సిరీస్ కీలకం. ఇందులో రాణించకుండా ఛాంపియన్స్ ట్రోఫీకి వెళ్లి.. అక్కడా విఫలమైతే కెరీర్ కష్టాల్లో పడ్డట్లే. కాకపోతే కొన్ని నెలల క్రితం ఆడిన లంక సిరీస్‌లో రోహిత్ రాణించడం ఒక్కటే ఊరట. ఇక ఇప్పటివరకు కోచ్‌గా ఎలాంటి వండర్లు చూపని గంభీర్‌కు ఈ సిరీస్ అగ్ని పరీక్షే. బుమ్రా ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్ నాటికి కోలుకుంటే షమీతో కలసి పేస్ దళాన్ని నడిపిస్తాడు.





# స్టేడియం వద్ద స్వల్ప తోపులాట..

## మ్యాచ్ సమయంలో విరాట్ కాళ్లు మొక్కిన ఓ ఫ్యాన్!

దాదాపు 12 ఏళ్ల తర్వాత భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ దేశవాళీ బరిలోకి దిగాడు. రంజీ ట్రోఫీ చివరి రౌండ్‌లో దిల్లీకి ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. అరుణ్ జైట్లీ మైదానం వేదికగా రైల్వేస్‌తో దిల్లీ తలపడుతోంది. అయితే, కోహ్లీని చూసేందుకు భారీగా అభిమానులు తరలివచ్చారు. దాదాపు 10వేల మందికి పైగా ప్రేక్షకులు వస్తారని దిల్లీ క్రికెట్ సంఘం ముందే అంచనా వేసింది. అందుకుతగినట్లుగా ఏర్పాట్లు చేసింది. కానీ, అభిమానులు మాత్రం భారీగా వచ్చారు. దీంతో స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. మైదానంలోని 16వ గేట్ వద్ద ఫ్యాన్స్ ఒకరినొకరు నెట్టుకుంటూ ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో కొందరు కింద పడిపోయారు. పోలీస్ శాఖకు చెందిన ఓ బైక్ కూడా ధ్వంసమైంది. చాలామంది షూలు, చెప్పులను వదిలేసి మరీ వెళ్లడం గమనార్హం. ఓ ముగ్గురు గాయపడినట్లు వార్తలు వస్తున్నాయి. వారికి డీడీసీఏ సెక్యూరిటీ, పోలీసులు ప్రాథమిక చికిత్స అందించారు. ఓ భద్రతా సిబ్బంది కూడా గాయపడినట్లు సమాచారం. పోలీసులు పరిస్థితిని చక్కదిద్దడంతో అంతా సద్దుమణిగింది.

### డీడీసీఏ సిబ్బంది తీరుతోనే..

అభిమానులు భారీగా వస్తారని దిల్లీ క్రికెట్ సంఘం అధికారులు ముందే చెప్పారు. అందుకోసం ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. కానీ, మైదానంలోకి పంపించేందుకు కేవలం మూడు గేట్లను మాత్రమే తెరిచి అందుబాటులో ఉంచటంపై విమర్శలు వస్తున్నాయి. మెట్రో స్టేషన్‌కు దగ్గరగా ఉండే గేట్ 16, గేట్ 17 వద్ద అభిమానులు ఉదయం నుంచే క్యూ కట్టారు. దాదాపు గంటపాటు వేచిఉన్నా గేట్లను తెరవలేదు. దీంతో కొందరు యువకులు ఆందోళనతో 16వ నెంబర్ గేట్‌ను ఓపెన్ చేయాలని నెట్టడం ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఇతర గేట్ల నుంచి వెళ్లాలని సెక్యూరిటీ ఆఫీసర్ చెప్పినా ఎవరూ వినలేదు. చిన్నారులతో వచ్చిన కొందరు అభిమానులు వారిని తమ భుజాలపై కూర్చోబెట్టుకున్నారు. ఆ సమయంలో పలువురు గాయపడ్డారు. చివరికి సెక్యూరిటీ అధికారులు వచ్చి గేట్‌ను ఓపెన్ చేసి నెమ్మదిగా పంపించారు. మ్యాచ్‌ను చూసేందుకు వచ్చేటప్పుడు ఆధార్ కార్డు తీసుకురావాలని డీడీసీఏ అభిమానులకు సూచించింది. కానీ, ఫ్యాన్స్ ఎక్కువగా ఉండటంతో వాటిని చెక్ చేయకుండానే లోపలికి అనుమతించారు.

### టాస్ నెగ్గి బౌలింగ్ ఎంచుకున్న దిల్లీ

రైల్వేస్‌తో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన దిల్లీ బౌలింగ్ ఎంచుకుంది. దీంతో తమ అభిమాన క్రికెటర్ విరాట్ కోహ్లీ బ్యాటింగ్‌ను చూడాలని వచ్చిన అభిమానులకు కాస్త నిరాశే ఎదురైంది. అయితే, కోహ్లీ మాత్రం సహచర క్రికెటర్లను ఉత్సాహపరుస్తూ మైదానంలో చురుగ్గా ఉన్నాడు. వికెట్లు తీసిన బౌలర్లను అభినందిస్తూ స్ఫూర్తి నింపాడు. ఈక్రమంలో ఓ అభిమాని మైదానంలోకి దూసుకొచ్చి విరాట్ కోహ్లీ కాళ్లకు నమస్కరించాడు. అతడిని పైకి లేపిన కోహ్లీ అలాంటివి చేయద్దంటూ సూచించాడు. ఆ వెంటనే సెక్యూరిటీ సిబ్బంది ఆ ఫ్యాన్‌ను బయటకు తీసుకెళ్లారు. ప్రస్తుతం రైల్వేస్ స్కోరు 20 ఓవర్లకు ఐదు వికెట్లను కోల్పోయి 66 పరుగులు చేసింది.